Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 23.01.2015, శుక్రవారం

సంపుటి : 34 సంచిక : 34


పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



- విభజన నష్టం ఇంకా తొలగలేదు
- పార్లమెంటులో ఇచ్చిన హామీలకు దిక్కులేదు
- చంద్రబాబు విధానాలతో ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం

## కేంద్రం దయతలిస్తేనే...

# అభివృద్ధి వైపు అడుగులు

మన దగ్గర పది లక్షల రూపాయలున్నాయనుకుందాం... వాటితో వ్యవసాయమో, వ్యాపారమో చేస్తే ఆదాయం వస్తుంది. పదిలక్షలతో ఒక కారు కొని బాడుగకు తిప్పుకున్నా రాబడి ఉంటుంది. కాని అదే కారులో మనం తిరుగుతుంటే ఏమవుతుంది. పది లక్షలకు వడ్డీ నష్టం, కారు విలువ తగ్గి పోతుంది. మధ్యలో ఆయిల్ బొక్క. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అష్టదరిద్రంగా ఉన్నాగాని చంద్రబాబు పాలసీ ఇలాగే తయారైంది.

లోపల చిరుగుల చొక్కా, బొక్కలు పడ్డ అండర్‌వేర్ వేసుకున్నా పైన మాత్రం సూటూ, బూటూ వేసుకోవాలనేది ఆయన సిద్ధాంతం. గతంలో 9ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఇదే పాలసీని అనుసరించాడు. హైటెక్ సిటీ, ఇంటర్నెట్, సిమెంట్‌రోడ్లు అంటూ ఉత్పాదన లేని రంగాలకు డబ్బులు ఖర్చుచేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల్లోకి నెట్టాడు. కనీసం ఇప్పుడన్నా ఆ పంథాను మార్చాడా.. అంటే అదీ లేదు. మళ్ళీ పాత పద్ధతులే!

విభజన మూలంగా రాష్ట్రం అడుక్కుతినే పరిస్థితిలో వుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గట్టిగా నిలబెట్టాలంటే ముందు ఉత్పాదక రంగాలపై దృష్టిపెట్టాలి. వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తులను పెంచే దిశగా చర్యలు చేపట్టాలి. కాని చంద్రబాబు ఆ పనుల జోలికి పోలేదు. ముందు అందమైన సింగపూర్ లాంటి రాజధాని కావాలనుకుంటున్నాడు. ఇది ఖర్చుయ్యేపని. ఋణమాఫీ పెట్టాడు. దీనికి డబ్బులు లేవు. సంక్రాంతి పండక్కి చంద్రన్న కానుకంటూ ఉచితంగా కొన్ని నిత్యావసర సరుకులిచ్చారు. దీనికి 300కోట్లకు పైనే ఖర్చుపెట్టారు. ఇవన్నీ కూడా

(మిగతా 10వ పేజీలో)

## కేడర్‌ను కాపాడుకోవడం...



# కత్తిమీద సామే!


ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడ్డాక తాముంటున్న పార్టీ అధికారంలోకి రాలేకపోతే నాయకులు ఇంక ఒక్కక్షణం కూడా ఆ పార్టీలో ఉండలేకపోతున్నారు. ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉండాలనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉండడమంటే వాళ్లకు నరకంగా తోస్తుంది. ప్రతిపక్షంలో ఉంటే పనులు జరగవు. అదీగాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్‌లు, ధర్నాలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు వంటి ఆందోళన కార్యక్రమాలను చేసుకుంటూ పోవాలి. ఇదంతా కూడా ఖర్చుతో కూడుకున్న పని. దీనిబదులు అధికారంలో వున్న పార్టీలోనే చేరితేపోలా... అనేది నాయకుల ఫిలాసఫిగా మారింది.

రాజకీయాలలో ఇలాంటి వాతావరణం ఉన్నప్పుడు ప్రతిపక్షంగా వున్న ఏ పార్టీకైనా 5ఏళ్ల మనుగడ కత్తిమీద సామే! ముఖ్యంగా పార్టీలో వున్న కేడర్‌ను నిలబెట్టుకోవడం కష్టసాధ్యంగా మారుతుంది. కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలు ప్రతిపక్షంలో ఉండడం వేరు. అవి జాతీయ పార్టీలు. కేడర్ నిలబడి వుంటుంది. అనుబంధ సంస్థలుంటాయి. ఎన్నికల సమయానికి ఆ కేడర్ పటిష్ట మవుతుంది. కాని (మిగతా 10వ పేజీలో)

శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. సం/-

## రైతులను బోల్తా కొట్టిస్తూ...



# రాజధానిపై అతిఅంచనా?

రాష్ట్ర నూతన రాజధాని విషయంలో ప్రభుత్వం అతిగా అంచనాలు వేసుకుంటోంది. మన ఇతిహాసాలలో చూస్తుంటాం... మాంత్రికుడు ఓంహ్రీం అనగానే నగరం వెలుస్తుంది. ఆ టైపులో రాజధానిని నిర్మించాలనే తపనతో చంద్రబాబు ఉన్నాడు. మొదట అద్భుతమైన, అది కూడా సింగపూర్ లాంటి రాజధానిని కడితేగాని రాష్ట్రంలో ప్రజలు బ్రతకలేరన్నట్లుగా వుంది చంద్రబాబు వ్యవహారశైలి.

రాష్ట్రంలో మిగతా పనులన్నీ వదిలేసి ఒక్క రాజధాని నిర్మాణమే ప్రధానమన్నట్లు దానిపై పడ్డారు. తుళ్లూరు కేంద్రంగా వేలాది ఎకరాల భూసమీకరణ మొదలైంది. సింగపూర్ కంపెనీలకు రాజధాని పనులు అప్పగించారు. తుళ్లూరు రాజధాని అయితే భవిష్యత్‌లో 80లక్షల మంది దాకా అక్కడికి వస్తారని, హైదరాబాద్‌లాగా అభివృద్ధి చెందుతుందని ఆశపడుతున్నారు. ఇది అతి అంచనా! హైదరాబాద్‌కు వందల ఏళ్ల చరిత్ర వుంది. చారిత్రాత్మక నేపథ్యముంది. నిజాంలకాలం నుండీ హైదరాబాద్ ఓ వెలుగు వెలిగింది. ఏపికి రాజధాని అయ్యాక శరవేగంగా అభివృద్ధి చెందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల (మిగతా 10వ పేజీలో)



# సమాజ సేవే ధ్యేయంగా జీవించాలి

**------------------ ప్రముఖ సినీనటుడు భానుచందర్**

ప్రతిఒక్కరూ సమాజసేవే ధ్యేయంగా జీవించాలని, సమాజానికి తమవంతు సేవలందించి జీవితాలను సార్ధకం చేసుకోవాలని ప్రముఖ సినీ నటుడు భానుచందర్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కావలి పట్టణంలో, కళాబంధు మన్నెమాల గోవిందరెడ్డి నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండుగ ఎంతో విశిష్టమైన పండుగ అని, తెలుగు ప్రజలందరికీ ఈ పండుగ ఎంతో ప్రీతిపాత్రమైనదని ఆయన అన్నారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో, ప్రధాని మోడీ పిలుపునకు స్పందించి తాను బిజెపిలో చేరానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం కావలిలోని శ్రీ కలుగోళ శాంభవి అమ్మవారి ఆలయానికి వెళ్ళి అక్కడ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మలిరెడ్డి రవీంద్రరెడ్డి, కార్యదర్శి రామిరెడ్డి, స్థానిక నాయకులు మన్నెమాల గోవిందరెడ్డి, మెతుకు రాజేశ్వరి, పద్మావతి శ్రీదేవి, లోక్‌సత్తా నాయకుడు మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఏఎస్ పేట గంధోత్సవం

నెల్లూరుజిల్లా ఏఎస్‌పేటలోని ఆల్‌హాజ్ హజరత్ సయ్యదినాఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 241వ ఉరుసు, గంథమహోత్సవం సోమవారం వైభవంగా తహలీల్ ఫాతెహాతో ముగిసాయి. దర్గా మసీదులో దాదాపు 300ఏళ్ల నాటి నాయబ్ రసూల్ వారి జపమాల(తజ్‌వీ)ని పోలీసు భద్రత నడుమ భక్తులకు చూపించారు. అనంతరం దర్గా సజ్జాద నివాసం మహల్ నుంచి సజ్జాదనషీన్ షా గులాం హాఫీజ్‌పాష, శిష్యబృందంతో కలసి గంథం, పూలచద్దర్లు తీసుకుని ఊరేగింపుగా దర్గాకు చేరారు. అనంతరం దర్గాలో గంథాన్ని లేపనం గావించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంథాన్ని భక్తులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో దర్గా మేనేజింగ్ ట్రస్టీ సైపూర్ రహమాన్ ఖాద్రి, ఎస్ఐ అంకమ్మ, దర్గా సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముగిసిన కసుమూరు గంధోత్సవం

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని కసుమూరులో మూడు రోజులుగా జరిగిన మస్తాన్‌వలీ 237వ గంథమహోత్సవం సోమవారంతో వైభవంగా ముగిసాయి. గంథం, ప్రసాదాలను చందన్ మహల్‌లో ఉంచి అక్కడ ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చందన్‌మహల్ నుంచి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కళాకారుల డప్పు వాయిద్యాలు భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపుగా బయలుదేరిన గంథం దర్గాకు చేరింది. అనంతరం ముజావర్లు గంథాన్ని దర్గాలో వుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్ సమాధిపై సుగంధద్రవ్యాలు గంథం పొడిని చల్లారు. అనంతరం గంథాన్ని మస్తాన్‌వలీ సమాధికి పూసి తహలీ, ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు గంథం, వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేశారు. దర్గా సూపరింటెండెంటు అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో గంథోత్సవాలు నిర్వహించారు.

## షార్‌కు శిక్షణ ఐఏఎస్ బృందం

సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(షార్)కు ఈనెల 28వతేదీ శిక్షణ ఐఏఎస్ బృందం రానుంది. ఈ బృందంలో 18మంది శిక్షణ ఐఏఎస్‌లు ఉన్నారు. వీరు 28న షార్‌కు వచ్చి లఘుచిత్రాన్ని చూసి అనంతరం అక్కడ వున్న రెండు ప్రయోగ వేదికలను, నూతనంగా నిర్మించిన నియంత్రణ కేంద్రాన్ని, పరీక్ష వసతులను సందర్శిస్తారు.

# మల్లికార్జునపురం అభివృద్ధికి కృషి చేస్తా!


**- సోమిరెడ్డి**

తోటపల్లిగూడూరు మండలంలో అభివృద్ధికి నోచుకోని మల్లికార్జునపురం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకుంటున్నానని, గ్రామాభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మల్లికార్జునపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు ఆచరణ రూపమిస్తామన్నారు. ఈ గ్రామంలోని యానాదులు విద్యతో పాటు, అన్ని రకాల వసతులకు దూరంగా వున్నారన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. చల్లా యానాదుల పిల్లలు బడికి వెళ్ళడం లేదని, వారి తల్లిదండ్రులకు విద్యపట్ల సరైన అవగాహన కలిగించేందుకు తగు శ్రద్ధ తీసుకుంటామన్నారు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రవాసాంధ్రులు తమ గ్రామాలను, వార్డులను దత్తత తీసుకుని వాటిని అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సావిత్రమ్మ, తహశీల్దారు రామలింగేశ్వరరావు, టిడిపి మండల కన్వీనర్ బొమ్మి సురేంద్ర, సర్పంచ్ వెంకటరమణయ్య, నాయకులు జడ్. శివ ప్రసాద్, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చినబాబిరెడ్డి, జితేంద్రగౌడ్, గోపాలయ్య నాయుడు, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి తదితంరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు హిమజ

జాతీయ స్థాయిలో ఈ నెల 28, 31 తేదీల్లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగే వాలీబాల్ పోటీలకు కొడవలూరు మండలంలోని కొత్త వంగల్లు జడ్పీ హైస్కూల్‌కు చెందిన యు. హిమజ అనే 8వ తరగతి విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల పిఇటి రామచంద్ర తెలిపారు. గతంలో హిమజ జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పలుమార్లు పాల్గొని తన క్రీడాప్రతిభను చాటుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నారయ్య, పాఠశాల హెడ్మాస్టర్ శివకుమార్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

# ‘నాటా’ నూతన కార్యవర్గం


డాక్టర్ ప్రేమ్‌రెడ్డి



రాఘవరెడ్డి

ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) కార్యవర్గ సమావేశం అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఆధ్వర్యంలో లాస్ వేగాస్‌లో జనవరి 10న జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షునిగా డాక్టర్ మోహన్ మల్లం ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత బోర్డు సభ్యులు ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా రాజేశ్వరరెడ్డి గంగసాని, ఎక్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్‌గా డాక్టర్ రాఘవరెడ్డి గోసల, సెక్రటరీగా గిరీష్ రామిరెడ్డి, ట్రెజరర్‌గా హరి వేల్కూర్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ గనగోని, జాయింట్ ట్రెజరర్‌గా భరత్ మాదాడి, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆళ్ళ రామిరెడ్డి, ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్‌గా జయచంద్రారెడ్డి, నేషనల్ కన్వెన్షన్ అడ్వైజర్‌గా ప్రదీప్ సామలను ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రేమ్‌రెడ్డి, అడ్వైజరీ కౌన్సిల్‌సభ్యులు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి మాట్లాడుతూ నాటా ఆధ్వర్యంలో జరిగిన అనేక సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ దిగ్విజయంగా నిర్వహించబడిన 2014 అట్లాంటా కన్వెన్షన్‌ను కీర్తిస్తూ కొనియాడారు.

నూతన బోర్డు సభ్యులు అన్నారెడ్డి, భరత్ మాదాడి, గిరీష్ రామిరెడ్డి, హరనాథ్ పొలిచర్ల, హరి వేల్కూర్, మహేందర్ ముసుకు, మల్లిక్ బండా, మోహన్ మల్లం, మోహన్ పట్లోల్ల, మోహన్‌రెడ్డి తలమాటి, రాఘవరెడ్డి గోసల, రాజేశ్వరరెడ్డి గంగసాని, రమేష్ చంద్ర, రామిరెడ్డి ఆళ్ళ, రామిరెడ్డి బుచ్చిపూడి, సాంబరెడ్డి, సంతోష్ పాతూరి, శివ మేక, శ్రీనివాసులరెడ్డి కొట్లూరు, శ్రీనివాసులురెడ్డి సోమవరపు, శ్రీకాంత్‌రెడ్డి పెనుమాడ, శ్రీని వంగిమళ్ళ, శ్రీనివాస్ గనగోని, శ్రీనివాసరెడ్డి ఆళ్ళ, స్టాన్లీరెడ్డి, శ్యామరెడ్డి, వెంకటరమణారెడ్డి మురారి, వెంకటరామిరెడ్డి శనివారపు, విష్ణు కోటంరెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2016లో జరిగే డాల్లస్ కన్వెన్షన్‌కు కన్వీనర్‌గా డాక్టర్ రమణారెడ్డి గూడూరుని, కో–ఆర్డినేటర్‌గా రామసూర్యరెడ్డిని ఎన్నుకున్నారు. మూడువందల మందికిపైగా పాల్గొన్న ఈ సమావేశం దిగ్విజయంగా ముగిసింది.

సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మెన్ డాక్టర్ ప్రేమ్‌రెడ్డి, ఎక్సిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ రాఘవరెడ్డి గోసల, బోర్డు సభ్యులు శ్రీనివాసులురెడ్డి సోమవరపు, విష్ణు కోటంరెడ్డి, కన్వీనర్ డాక్టర్ రమణారెడ్డి గూడూరు మన నెల్లూరు వాస్తవ్యులు కావడం విశేషం.

# వాత్సల్యకు తుంగా ట్రస్ట్ విరాళం



‘లాయర్’ వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా వాత్సల్య అనాధ శరణాలయానికి జనవరి 18వ తేదీ ఆదివారం మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి చేతుల మీదుగా వాత్సల్య గౌరవఅధ్యక్షులు సామంతు గోపాలరెడ్డికి ఇరవైవేల రూపాయల విరాళాన్ని చెక్కు ద్వారా అందజేశారు. తుంగా శివప్రభాత్‌రెడ్డి స్వగృహంలో స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి 20వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ గత 20సంవత్సరాలుగా తుంగా రాజగోపాలరెడ్డి స్మృత్యంకంగా ప్రతిఏటా అయిదుమంది విద్యార్థినీవిద్యార్థులను తుంగా రాజగోపాలరెడ్డి ట్రస్టు ద్వారా చదివిస్తున్నట్లు తెలిపారు. ఇక ముందు కూడా తుంగా రాజగోపాలరెడ్డి స్మృత్యంకంగా విద్యా వైద్య పరంగా తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగా కుటుంబసభ్యులు, ‘లాయర్’ సిబ్బంది, నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ భవనానికి శంకుస్థాపన



లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు వారు ఎట్టకేలకు ఓ సొంత భవనాన్ని నిర్మించుకోవడానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 22వ తేదీన నెల్లూరు, ముత్తుకూరురోడ్డులో లయన్స్‌క్లబ్ భవన నిర్మాణానికి యడ్లపల్లి వెంకటేశ్వర్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ యడ్లపల్లి సురేష్ శంకుస్థాపన చేశారు. లయన్స్ భవనానికి యడ్లపల్లి సురేష్ తమ సొంత స్థలాన్ని విరాళంగా ఇవ్వడం విశేషం. ఈ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ అమృతవల్లి, క్లబ్ అధ్యక్షులు కృష్ణమోహన్, కార్యదర్శి యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, కోశాధికారి టి.సహజానందరెడ్డి, బిల్డింగ్ కమిటి ఛైర్మెన్ పచ్చిపులుసు శ్రీరాములు పాల్గొన్నారు.

# మాటల్లో కాదు.. చేతల్లోనూ ఆదర్శం



## కోటంరెడ్డి నిరాడంబరతకు ఇదో నిదర్శనం


శుభలేఖ

నమస్కారాలు

మా కుమార్తె

చి॥ల॥సౌ॥ హైందవి

చి॥ బాలానంద్‌రెడ్డి

(శ్రీమతి & శ్రీ దేవిరెడ్డి రాజేశ్వరి - మల్లిఖార్జునరెడ్డి గార్ల కుమారుడు)

వివాహ సుముహూర్తం

తేది : 27-2-2015 శుక్రవారము

శుభలగ్నం : ఉదయం గం॥ 9-00 - 10-00 ల లోగా

పుష్కరకాలం : ఉదయం గం॥ 9-54 - 9-57 ని॥లకు

వేదిక : వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్, గొలగమూడి రోడ్డు, నెల్లూరు.

అల్పాహార విందు : ఉదయం గం॥ 9-00 లకు

మీ ఆశీస్సులే మా బిడ్డ పెళ్ళికి వేదమంత్రాలు

నూతన వధూవరుల కొత్త జీవితానికి శుభాశీస్సులు

మీ ఆగమనం మాకు ఆనందం
శ్రీమతి & శ్రీ కోటంరెడ్డి సుజిత - శ్రీధర్‌రెడ్డి
నెల్లూరు రూరల్ శాసనసభ్యులు

***కొందరు నాయకులు అందరూ ఆదర్శంగా వుండాలంటూ బోలెడన్ని మాటలు చెప్పేస్తుంటారు. తీరా తమ వద్దకు వచ్చేసరికి ఆ మాటలు తమకు వర్తించవన్నట్లుగా ప్రవర్తిస్తుంటారు. కానీ, కోటంరెడ్డి అలా కాదు.. చెప్పే మాటల్లోనే కాక, ఆచరణలోనూ మార్గదర్శకంగా నిలుస్తూ... అందరికీ ఆదర్శంగా వుంటున్నారు.***

అనవసర వ్యయాలూ, ఆర్భాటాలు వద్దని ఆయన ఎల్లవేళలా చెప్తూనే వుంటారు. చెప్పడమే కాదు, తాను స్వయంగా ఆచరిస్తుంటారు కూడా. అందుకు ఆయన కుమార్తె శుభలేఖే ఒక చక్కని నిదర్శనం. కుమార్తె పెళ్ళి వచ్చిందంటే చాలు, ఎంతో ఆడంబరంగా లక్షలాది రూపాయలు వెచ్చించి, బహు సుందరంగా శుభలేఖలు ముద్రించి వూరంతా పంచాలని అనేక మంది నాయకులు భావిస్తుంటారు. అయితే, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం అలాంటి ఖరీదు వ్యవహారాలను దూరంగా పెట్టి, సాధారణమైన తెల్లకార్డు మీదనే, అత్యంత సాదాసీదాగా శుభలేఖను ముద్రించి అందరికీ పంపిణీ చేశారు. ఫిబ్రవరి 27వ తేదీన తమ కుమార్తె వివాహమని, మీ ఆశీస్సులే మా బిడ్డ పెళ్లికి వేదమంత్రాలనీ, నూతన వధూవరుల కొత్త జీవితానికి మీ ఆశీస్సులే శుభాశీస్సులనీ పేర్కొంటూ, ఆయన ఎంతో అభిమానంగా ఆ శుభలేఖను పంపారు. శుభలేఖ చూసేందుకు సాదాసీదాగానే వున్నా, అందులోని అక్షరాలు కోటంరెడ్డి వినమ్రతకు, అభిమానానికి దర్పణంగా నిలుస్తాయి. అందరినీ ఆయన ఆహ్వానించిన తీరు మరీ ముచ్చటేస్తుంది. సాధారణంగా ఎమ్మెల్యే స్థాయి నాయకులు ఇలాంటి సందర్భాల్లో ప్రముఖులకు, నాయకులు, అధినాయకులు, విఐపిల స్థాయిలకు చెందినవారికి వారి స్థాయికి తగ్గట్టుగా, ఎంతో ఖరీదుచేసే పలు రకాల పెళ్ళికార్డులను మరింత ఖరీదువి ముద్రించి పంపిస్తుండడం అందరికీ తెలిసిందే. అయితే, కోటంరెడ్డి అలాంటి వాటికన్నీ స్వస్తి చెప్పి, విఐపిలైనా, సామాన్య ప్రజలైనా ఎవరైనా సరే, తమను అభిమానించే వారందరూ తనకు ఒకటే అన్నట్లుగా, ఎలాంటి తేడాలు లేకుండా అందరికీ ఒకే రకం పెళ్ళికార్డును పంపడం విశేషం. పెళ్ళికి ఖచ్చితంగా అవసరమయ్యే వ్యయం ఎటూ ఎవరికైనా సరే తప్పనిసరైనప్పటికీ, పెళ్ళికార్డుల వద్ద నుంచే అనవసర వ్యయానికీ, ఆడంబరాలకు పోవడానికి ఇష్టపడని కోటంరెడ్డి తమ కుమార్తె శుభలేఖ విషయంలోనూ ఆదర్శంగానే నిలిచారు. శుభలేఖను ఎంతో నిరాడంబరంగా ముద్రించి, అందరికీ పంపి అందరి అభిమానాన్నీ చూరగొన్నారు. తన కుమార్తె శుభలేఖ విషయంలోనూ ఆదర్శాన్ని వీడని కోటంరెడ్డికి అభినందనలు. ఆయన కుమార్తె వివాహం సందర్భంగా, ఆ నూతన వధూవరులకు ‘లాయర్’ హృదయపూర్వక శుభాకాంక్షలు.

# జగన్ వస్తున్నాడు



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, శాసనసభ ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 25వతేదీ నెల్లూరు రానున్నారు. సూళ్లూరుపేటకు చెందిన వైకాపా నాయకుడు దబ్బల రాజారెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ ఆరోజు నెల్లూరులో జరుగనుంది. ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్ వస్తున్నారు. రిసెప్షన్ చూసుకుని ఆయన అప్పుడే బయల్దేరి వెళతారు. జగన్ రాక సందర్భంగా ఆ పార్టీ నాయకులు నెల్లూరులో భారీ స్వాగత సన్నాహాలు చేస్తున్నారు.

# పేదల హృదయాల్లో వెలిగిన విద్యాదీపం ఎన్‌బికెఆర్


వేమిరెడ్డిని సత్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకునిగా ఎనలేని సేవలందిస్తూ, సమాజంలో పేదరికం, అంటరానితనం నిర్మూలనకు ఎంతో కృషిచేసిన మహనీయుడు దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డికి కోటలో ఈనెల15న శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ దాత, సంఘసేవకులు, వైఎస్సార్సీపి సీజీసీ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, విద్యాబుద్ధులు నేర్పిన మహనీయుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి అని ప్రశంసించారు. బలహీనవర్గాలవారి అభ్యున్నతి కోసం అహరహం కృషి చేసిన ఆయనను ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో గౌరవించిందన్నారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శతజయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జీవితచరిత్ర గ్రంథాన్ని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మెన్ ఐ.గోపాలరెడ్డి, సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల మేనేజర్ రామకృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది పివి రమణారెడ్డిలను రామ్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి కుమారులు హిమకుమార్‌రెడ్డితోపాటు, పలువురు ప్రముఖులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాంబాబు బదిలీ

## గ్రామీణ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు గ్రామీణ డిఎస్పీ వాకా శ్రీరాంబాబును విఆర్‌కు బదిలీ చేశారు. ఆయనకు రాజధాని ప్రాంతమైన గుంటూరు అర్బన్ జిల్లాలో పోస్టింగ్ ఇవ్వొచ్చని సమాచారం. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాలో డిఎస్పీగా పనిచేస్తున్న తిరుమలేశ్వరరెడ్డిని నియమించారు. తిరుమలేశ్వరరెడ్డిది కడప జిల్లా రాజంపేట. సీతారాంపురం మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డికి దగ్గరి బంధువు. ఇక బదిలీ అయిన రాంబాబుకు నెల్లూరుజిల్లాతో దాదాపు రెండు దశాబ్దాల అనుబంధం. ఏదో కొంతకాలం తప్పితే మిగతా ఆయన సర్వీసు కాలమంతా కూడా నెల్లూరులోనే గడిచిపోయింది. జిల్లాలో పలు స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశారు. నెల్లూరు నగరంతో పాటు కోవూరు సిఐగా, సిఐడి సిఐగా సుదీర్ఘకాలం పనిచేశారు. డిఎస్పీగా పదోన్నతి వచ్చాక సిఐడి డిఎస్పీగా పనిచేస్తూ ఆ తర్వాత బదిలీ మీద నెల్లూరు గ్రామీణ డిఎస్పీగా పనిచేశారు. ఈ నెల 22వ తేదీ హోటల్ అతిథిగ్రాండ్‌లో రాంబాబుకు వీడ్కోలు సభ జరిగింది. డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

## 'ప్రభా'తం

అది ఎంత గొప్ప పథకమైనా..ఆచరణలో చిత్తశుద్ధి లేనప్పుడు చతికిలపడడం తప్పదు. పథకం ఎంతటి ఘనమైనదైనా..ఆచరణ పూజ్యమైతే మాత్రం, ఆ పథకం చివరికి నిరర్ధకమే అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచీ ఎన్నెన్నో పథకాలు వచ్చాయి కానీ, 'స్వచ్ఛ భారత్' వంటి ప్రజలందరి శ్రేయస్సుకూ ఎంతో ప్రయోజనకరమైన పథకాలు ఏ ఒకటో రెండో వుంటాయి. అలాంటివి కూడా ఆచరణలో వెనుకంజవేస్తే అంతకన్నా దురదృష్టం మరొకటి వుండదు. ప్రజలందరి మేలు కోరే ఇలాంటి పథకాలను అందరూ ప్రోత్సహించాలి. ప్రజల భాగస్వామ్యంతో ఇలాంటి పథకాలు బాగా రాణించాలి. అయితే, నేటికీ ఇంకా మన పల్లెలు, పట్టణాలు, నగరాల్లోని మురుగు వాతావరణం చూస్తుంటే...స్వచ్ఛభారత్ వంటి గొప్ప పథకాలను కూడా మనం చేజేతులారా దూరం చేసేసుకుంటున్నామా అనిపిస్తోంది. ఎక్కడ చూసినా మురుగుమడుగులు, చెత్తకుప్పలు, దుర్వాసనలో మునిగిపోయి అనేక ప్రాంతాలు మురికి కూపాలుగానే వుంటుండడం ఎనలేని ఆవేదన కలిగిస్తోంది. పరిస్థితి ఇంత దయనీయంగా వున్నా ఇంకా మనం ప్రచారార్భాటాలతోనో, మొక్కుబడి పనులతోనో కాలయాపన చేస్తున్నామా అనిపిస్తోంది. మన పరిసరాలు ఇంతగా కలుషిత మవుతున్నా, ఎక్కడ చూసినా కాలుష్యవాతావరణం కనిపిస్తున్నా..దానిని నివారించుకునేందుకు మనం ఆశించిన స్థాయిలో మన కర్తవ్యం మనం నిర్వహిస్తున్నామా?..ఇదేనా మన ఆచరణ?..అన్న సందేహం కలుగుతోంది. అపారమైన విజ్ఞానంతో, శాస్త్రసాంకేతికరంగాలు శరవేగంగా వృద్ధి చెందుతోన్న నేటి ఆధునిక కాలంలోనూ దేశంలో ఇంకా..కనీస వసతులు లేని ప్రాంతాలు, మరుగుదొడ్లు కూడా లేక ప్రజలు అవస్థలు పడుతుండడం ఎంత దారుణం?.. చివరికి పాఠశాలల్లో సైతం మరుగుదొడ్లు సక్రమంగా లేక బాలబాలికలు నిత్యం అవస్థలు పడుతూనే వుండడం.. దళితవాడల్లో ఈ పరిస్థితి మరింత ఘోరంగా వుండడం.. నేటికీ అనేక చోట్ల పారిశుద్ధ్య పరిస్థితులు సక్రమంగా లేకపోవడం ఎంత దౌర్భాగ్యం?..మురుగుకాలువలు పూడిక తీసేవారు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేక అనేక ప్రాంతాల్లో ఎక్కడి మురుగు అక్కడే మడుగులు కట్టివుండడం, ఇళ్ళలోని మురుగునీరంతా ఇళ్ళ ముందే కాలువలు కడుతుండడం, వాటిలో దోమల పుట్టలుగా పెరుగుతుండడం, వీధు ల్లోనూ, రద్దీగా వుండే కూడలి వంటి ప్రాంతాల్లోనూ ఎటు చూసినా చెత్తదిబ్బలు పేరుకుపోతుండడం, జనావాసాల వద్ద, హోటళ్ళ వద్ద, మార్కెట్ల వద్ద ఇలా ఎక్కడ చూసినా పందుల గుంపులు, దోమలు..ఈగలు స్వైరవిహారం చేస్తుండడం ..ఇలా చెప్పుకుంటూ పోతే ఈ మురుగు పురాణానికి అంతూపొంతూ వుండదు. మన చేతులు పరిశుభ్రంగా లేకపోతే మనం తినే ఆహారం ఎలా కలుషితమవుతుందో, అదేవిధంగా మన పరిసరాలు సక్రమంగా లేకపోతే మనకు తెలియకుండానే అనేక వ్యాధుల బాధలు చుట్టుముడుతుంటాయి. అయినా, ఎవరికి వారు పట్టించుకోకుండా వుండడం వల్లనే ఈ పరిస్థితి దాపురిస్తోంది. అపరిశుభ్రత అంతటా తాండవిస్తోంది. ఈ దుస్థితి నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని ప్రధాని నరేంద్రమోడీ ఎంతో చిత్తశుద్ధితో, ఆచరణాత్మకమైన విధానాలతో 'స్వచ్ఛభారత్' అనే బృహత్పధకానికి మూడు నెలల క్రితం శ్రీకారం చుట్టారు. 'దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుద్ధ్యం ఎంతో ముఖ్యమని' పూజ్య బాపూజీ ఆనాడే చెప్పిన మాటల్నే స్ఫూర్తిగా తీసుకుని, గత అక్టోబర్ 2 వ తేదిన గాంధీజయంతి సందర్భంగా, ప్రధాని నరేంద్రమోడీ దేశభక్తితో 'స్వచ్ఛభారత్' అనే బృహత్పధకాన్ని ప్రవేశపెట్టారు. దేశవ్యాప్తంగా ప్రజలందరికీ స్వచ్ఛతను, పరిశుభ్రతను, పచ్చదనాన్ని పంచి, మంచి ఆరోగ్యాన్నీ, ఆహ్లాదకర వాతావరణాన్నీ అందివ్వాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన ఈ పథకం దేశవ్యాప్తంగానే కాదు, ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంది. అనారోగ్యకర వాతావరణాన్ని పారద్రోలి స్వచ్ఛభారత్‌ను మనకు మనమే నిర్మించుకోవాలని మనసారా ఆకాంక్షిస్తూ ప్రధాని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. పుట్టెడు పేదరికంతో, అజ్ఞానమనే అంధకారంలో వుంటూ, ఏళ్ళు గడుస్తూనే వున్నా ఎలాంటి ప్రగతికీ నోచుకోక అలమటించే అనేకమంది నిరుపేద ప్రజలు నేటికీ మరుగుదొడ్లు లేక, ఆరుబయటనే కాలకృత్యాలు తీర్చుకునే దయనీయ పరిస్థితి నుంచి విముక్తి కలగాలనీ, అందరికీ మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులోకి తేవాలనీ, పచ్చదనంతో మనదేశం ఫరిడవిల్లాలని ఆకాంక్షిస్తూ ఆ పథకానికి అవసరమైన నిధులను, ఆచరణాత్మక విధులను ఆయన నిర్దేశించారు కూడా. అంతేకాదు, కనీసం వారానికి రెండుగంటల పాటైనా అందరూ కలసి పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని, తమ పరిసరాలను, తాము పనిచేసే కార్యాలయాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో ఎవరి చిత్తానుసారం వారు చెత్తను వేయకుండా ఒక నిర్ణీత పద్ధతిలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించుకోవాలని నిర్దేశించారు. అయితే, దురదృష్టవశాత్తూ ఇంతటి మహోన్నతమైన 'స్వచ్ఛభారత్' పథకం కూడా రానురాను ఆశించిన స్థాయిలో ముందంజ వేయలేకపోతోందన్నదే ఆవేదన. స్వచ్ఛభారత్ ప్రకటించి మూడు నెలలు గడిచిపోయినా.. ముఖ్యంగా మన రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా.. ఈ పథకం ఆచరణలో ఆశించిన స్థాయిలో వుండడం లేదు. పలుచోట్ల ప్రచారార్భాటాలే తప్ప, పారిశుద్ధ్య పనులు నామమాత్రంగానే వుంటున్నాయి. శాశ్వత ప్రాతిపదికన మురుగును నివారించే చర్యలు అసలు కనిపించడం లేదు. ఎప్పుడో ఒకరోజు, ఏదో ఒక వూర్లో, ఏ కొంతమందో కలసి పారలు, చీపుర్లు చేతపట్టుకుని పారిశుద్ధ్యం పరిరక్షణకు నడుము బిగిస్తున్నారే తప్ప, ప్రతి ప్రాంతంలోనూ ఒక నిర్దిష్టమైన కార్యాచరణ నేటికీ లేకపోవడం విచారకరం. ఇకనైనా, స్వచ్ఛభారత్ అనేది ఒక పథకంగా కాక, అదొక పవిత్రకార్యంగా భావించి, చిత్తశుద్ధితో అమలుచేసుకునేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలి. అంతే తప్ప, నామమాత్రపు పనుల వల్ల, ప్రచారార్భాటాల వల్ల ఎలాంటి ప్రయోజనం వుండదని గుర్తుంచుకోవాలి. మనమూ.. మన ఇల్లు, మన వీధి.. మన వాడ.. మన వూరు.. మన జిల్లా.. మన దేశం.. ఇలా అన్ని చోట్లా పచ్చదనం.. పరిశుభ్రత వెల్లివిరిసేలా చూడాలి. అందుకోసం, అందరం కలసి స్వచ్ఛందంగా స్వచ్ఛభారత్‌ను వేగవంతంగా అమలుచేయాలి. అందరూ కలసి పరిశుభ్ర భారత్‌కు పటిష్టమైన బాటలు వేసేందుకు ఇదే మంచి తరుణం. దేశప్రజలందరి మేలు కోరే ఇంతటి బృహత్తరమైన పథకం రావడమే ఒక వరం. దానిని సద్వినియోగం చేసుకోలేకపోతే.. ఎంతైనా దురదృష్టకరం. మొక్కుబడిగా కాక చిత్తశుద్ధితో..దేశభక్తితో అందరూ కలసి పరిశుభ్ర భారతావని నిర్మాణానికి ఉద్యమించాలి. అప్పుడే స్వచ్ఛభారత్‌కు సార్ధకత!.. మన పవిత్ర భారతావనికీ ఎనలేని ఘనత!...

### 'స్వచ్ఛ' ఆచరణ ఏది?



ఏప్రాంతంలో చూసినా చెత్తకుప్పలు, మురుగుదిబ్బలు.. దుర్గంధపూరిత వాతావరణం, కాలుష్యమే కనిపిస్తున్నాయి. వీటిని పారద్రోలేందుకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలి. అంతటా ఆవరించిన అపారిశుద్ధ్యంపై అందరూ కలసి యుద్ధం ప్రకటించాలి.. మురుగును ఎక్కడి కక్కడ తరిమివేయాలి. ఎల్లెడలా పచ్చని మొక్కలు నాటి పచ్చదనానికి పందిర్లు వేయాలి. మన ప్రాంతాలన్నిటినీ పూల పొదరిళ్ళుగా వుండేలా తీర్చిదిద్దుకోవాలి. స్వచ్ఛభారత్ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలి.

## వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

### --- ఏఆర్ పోలీసులకు జిల్లా ఎస్పీ సూచన ---





మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ఎఆర్ సిబ్బందికి సూచించారు. ఈ నెల 19న నెల్లూరులోని పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో ఏఆర్ మొబలైజేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.


ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదని, పోలీసులు తమ విధుల పట్ల క్రమశిక్షణతో వుంటూ వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. విధుల్లో మంచి ప్రతిభను కనుపరుస్తూ జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. విధులపై అవగాహన పెంచుకునేందుకు, మానసిక శారీరక వత్తిడులను తగ్గించుకునేందుకు ఈ మొబలైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఆర్ డిఎస్పీ ఎల్ చెంచురెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా పదిహేనురోజుల పాటు ఏఆర్ సిబ్బందికి మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఏఆర్ సిబ్బందిని రెండు విభాగాలుగా విభజించి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణ రోజుల్లో వారు నిర్వహించే విధులను సివిల్ పోలీసులు నిర్వహించేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ రెడ్డి గంగాధర్, ఏఆర్ ఆర్ఐ శ్రీనివాసరావు, హోమ్‌గార్డ్స్ ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## తెలుగు వెలుగు ఎన్టీఆర్




తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, తెలుగుజాతి వెలుగు పద్మశ్రీ డా॥ నందమూరి తారకరామారావు 19వ వర్ధంతి కార్యక్రమాన్ని నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.రవి ఆధ్వర్యంలో గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అతిథులు, అభిమానులు, నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని యావత్ తెలుగు ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాముల రమణయ్య, టి.వి.నటులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




## శెభాష్ కోటంరెడ్డి

తరతరాల చరిత్ర కలిగిన రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా, సామాన్య కుటుంబం నుండి వచ్చి ఎమ్మెల్యే అయిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమర్ధవంతంగా పనిచేస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అత్యంత ఉత్సాహంగా చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నిధులు లేక ఏ పనీ చేయలేని తరుణంలో ఆయన తన జీతాన్ని సైతం ప్రజాసేవా కార్యక్రమాలకు కేటాయించడం ఎంతో మెచ్చుకోదగినది. అలాగే ఇస్కాన్‌సిటీ ప్రాంతంలో అన్యాక్రాంతమైన మున్సిపల్ రిజర్వ్ స్థలాన్ని వెలుగులోకి తెచ్చి స్వాధీనం చేసుకునేలా పోరాడినందుకు అభినందనలు.

**పులిశెట్టి నాగరాజు, నెల్లూరు.**

## పందేల్లో భేదాలు

ఉగాది మొదలుకొని సంక్రాంతి వరకు దేశంలో అనేక పర్వదినాలు జరుగుతుంటాయి. స్వాములు, రాజకీయనాయకులు ప్రధానపాత్రధారులు. రాజకీయ నాయకులకు పండుగ పరమార్ధాలు తెలియకున్నా ఉపన్యాసాలు దంచేస్తారు. సంక్రాంతి కోడిపందేలు వేల సంవత్సరాల నుండి వస్తున్నాయి. హైకోర్టు వద్దంది. సుప్రీంకోర్టు సై అంది. రాజకీయ నాయకులు కూడా పందేలు ఆడారు. కోడిపందేలు జంతు హింస అంటారు. రోజూ లక్షలాది జంతువులను వధిస్తుంటారు. జాతర్లలో, మరికొన్ని మతాలవారు లక్షలాది జీవాల్ని వధిస్తుంటారు. మరి దీని గురించి ఎవరూ పట్టించుకోరు. మన విధానాలన్నీ లోపభూయిష్టమే. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఇవేం మాటలు

వయసు ప్రభావమో ఏమో గాని ఈమధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు వివాదాస్పదమవుతున్నాయి. జనాభా పెరుగుదలను అరికట్టాలని ప్రపంచమంతా ఘోషిస్తుంటే, చంద్రబాబు మాత్రం ఒకరిద్దరితో ఆగకుండా పిల్లల్ని కనమంటున్నాడు. ఒకరిద్దరు బిడ్డల్ని చదివించి, వారికి ఉపాధి చూపించేసరికే తల్లిదండ్రులు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. దేశంలో నిరుద్యోగుల సంఖ్య కోట్లలో వుంది. వనరులు పరిమితంగా ఉన్నాయి. జనాభాను పెంచుకుంటూపోతే వారికి ఉపాధి చూపించే సామర్ధ్యం చంద్రబాబుకు ఉందా? **– జి.కొండారెడ్డి, పాములూరు.**


# పథకాలు జాస్తి... నిధులు నాస్తి

**పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్నట్లుగా తయారైంది ప్రభుత్వ పనితీరు. పథకాలేమో ఘనంగా ప్రకటిస్తున్నారు... ఆచరణలో మాత్రం వాటి అమలు కనిపించడం లేదు. ప్రజలే చందాలేసుకునో లేకుంటే దాతలను అడుక్కునో ఈ పథకాలను అమలు చేసుకోవాలన్నట్లుగా వుంది ప్రభుత్వ వ్యవహారం.**

## ప్రచారార్భాటం తప్ప పనులు లేవు







రాష్ట్ర విభజనతో ఏపికి ఆదాయం లేకుండాపోయింది. ఉద్యోగులకు కేంద్రం దయతలచి విదిలిస్తే జీతాలివ్వాల్సిన పరిస్థితి. దీనిని ఎవరూ కాదనలేరు. రాష్ట్రం ఇలాంటి పరిస్థితుల్లో వున్నప్పుడు కొత్తగా ఏర్పడిన ఏ ప్రభుత్వమైనా ఆర్భాటాలకు పోకుండా ముందు రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకునే మార్గాలపై దృష్టి సారించాలి. కాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పని చేయలేదు. అప్పులో అప్పు అన్నట్లు ఆర్భాటపు పనుల జోలికెళ్లాడు. ఋణమాఫీ ఒకటి... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన కార్యక్రమమిది. అసలు చంద్రబాబు ఋణమాఫీ ఊసే ఎత్తకపోయి ఉంటే ఆర్థిక వ్యవస్థ సక్రమంగానే వుండేది. బ్యాంకులో లావాదేవీలు బాగానే నడిచేవి. రైతులు కూడా తీసుకున్న అప్పులను తిరిగి కడుతూ కొత్తగా ఋణాలను తీసుకుంటుండేవాళ్లు. రైతాంగం బాగానే వుండేది. కాని అటు ఇటూ కాని ఋణమాఫీని అమలు చేసారు. దీంతో రైతుకు ఋణం పూర్తిగా మాఫీ కాక, అలాగని కొత్త అప్పు పుట్టక త్రిశంకుస్వర్గంలో వున్నారు. ఋణమాఫీని నమ్ముకుని అప్పులు, కట్టిన వడ్డీలు పెరిగి చాలామంది రైతులు నష్టపోయారు!

చంద్రబాబు పెట్టిన ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకం కూడా అంతంత మాత్రంగా వుంది. దీనిని పటిష్టంగా అమలు చేయడానికి ప్రభుత్వం వద్ద నిధులు లేవు. ఈ పథకం క్రింద గుర్తించిన ప్రాంతాలలో మినరల్ వాటర్ ప్లాంట్లను దాతల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఉచిత సలహా ఇచ్చింది. ప్రతి నియోజకవర్గంలో మహా అంటే ఓ పది లేదా ఇరవై గ్రామాలలో దాతల సహకారంతో ఆర్ఓ ప్లాంట్లు పెట్టొచ్చు. మరి మిగతా గ్రామాల పరిస్థితి. ఇప్పటికే మినరల్ వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు పలచబడిపోయింది. చంద్రబాబు స్మార్ట్ విలేజ్‌లంటూ కొత్త పని పెట్టాడు. వూర్లలో చెత్తను ఎత్తే దిక్కు లేదు. ఒక కిలోమీటర్ రోడ్డు, ఒక అరమీటరు డ్రైనేజీ కట్టడానికి కూడా నిధులు లేవు. మరి స్మార్ట్ విలేజ్‌లంటూ ఏం వెలగబెడతారు?

కేవలం పథకాల పేర్లతో ప్రచారార్భాటాలతో ప్రభుత్వం నడిచిపోతుంది. నిధులు లేక, చేసేందుకు పనులు లేక ఎమ్మెల్యేలు కూడా కోట్లు ఖర్చుపెట్టుకుని మేమెందుకు ఎమ్మెల్యేలయ్యాంరా దేవుడా అని మథనపడుతున్నారు.



### ఈ రోడ్డును...

## విస్తరించకుంటే విషాదాలే!

రాష్ట్రంలోనే అత్యంత రద్దీగల రహదారుల్లో ఒకటి నాయుడుపేట – బెంగుళూరు రోడ్డు. ముఖ్యంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఈ రోడ్డులోనే ఉండడంతో రద్దీ సాధారణమే. ఇక చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని కోస్తా జిల్లాల నుండి బెంగుళూరు పోవడానికి కూడా ఇదే ప్రధానమార్గం. విజయనగరం, విశాఖపట్నం వంటి దూరప్రాంతాల నుండి కూడా బస్సులు ఈ మార్గంలోనే బెంగుళూరుకు వెళుతుంటాయి. ఇక కోస్తా జిల్లాలతో పాటు ఒరిసా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల నుండి వాహనాలలో తిరుమలకు వచ్చే యాత్రికులకు కూడా ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలోనే రేణిగుంట ఎయిర్‌పోర్టు వుంది. దీంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజాప్రతినిధులు కూడా విమానాలు ఎక్కడానికి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు ఈ రహదారిలోనే చేరుకుంటుంటారు. పంచలింగాలలో ఒకటైన వాయు లింగేశ్వరస్వామి కొలువైన శ్రీకాళహస్తి ఈ రహదారిలోనే వుంది. కాబట్టి ఈ రహదారిలో ఎంత వాహన రద్దీ ఉంటుందనేది ప్రత్యేకంగా ప్రస్తావించనక్కరలేదు.

ఎప్పుడో నాలుగు లైన్ల రహదారిగా మారాల్సిన ఈ రోడ్డు ఇప్పటికి కూడా డబుల్ రోడ్డుగానే వుంది. ఎన్‌హెచ్–5 అంతా నాలుగులైన్లు, ఆరులైన్లే. నాయుడుపేట నుండి కర్నాటక సరిహద్దు దాకా మాత్రమే డబుల్‌రోడ్డు. అక్కడనుండి బెంగుళూరు వరకు 6లైన్ల రహదారి. ముఖ్యంగా నాయుడుపేట నుండి పూతలపట్టు దాకా ప్రయాణం ప్రమాదకరంగా వుంటుంది. ప్రతి ఐదు సెకండ్లకోవాహనం ఎదురొస్తుంటుంది. దీంతో ముందు వెళ్లేవాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టిన ప్రమాదాలెన్నో ఉన్నాయి. ఇక ఈ రోడ్డు పక్కనే డాబాలు, హోటళ్లు ఉండడంతో లారీలు, ఇతర వాహనాల వాళ్లు రోడ్డు పక్కనే వాటిని నిలిపేసి పోతుంటారు. రాత్రివేళల్లో ఇలా రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాలతో కూడా ప్రమాదాలు ఎదురవుతున్నాయి. వాహనాల రద్దీ వల్ల ప్రయాణ సమయం పెరిగిపోతుంది. నెల్లూరు నుండి నాయుడుపేటకు వోల్వో బస్సులో గంట ప్రయాణం. నాయుడుపేట నుండి తిరుపతికి కూడా ఇదే దూరం. కాని ప్రయాణం మాత్రం ఒకటిన్నరగంట నుండి రెండుగంటల దాకా పడుతుంది.

గత ప్రభుత్వంలోనే ఈ రోడ్డును జాతీయ రహదారులలో చేర్చారు. నాయుడుపేట నుండి పూతలపట్టు వరకు నాలుగులైన్లుగా విస్తరించాలని ప్రతిపాదించారు. కాని ఇంతవరకు దాని గురించి పట్టించుకోలేదు. ఎంతో ప్రాధాన్యతగల రహదారి ఇది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ రహదారి విస్తరణను సత్వరం చేపట్టడానికి ప్రయత్నించాల్సివుంది.

## 'చక్రం' తిప్పని కమిషనర్

### మంత్రి వైఖరే కారణమా?



***నెల్లూరు నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వస్తే నగరం కొంత బాగుపడుతుందనేది చాలాకాలం నుండి జనంలో ఉన్న అభిప్రాయం. అయితే గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అది సాధ్యపడలేదు.***

ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వస్తే అతని మీద రాజకీయ ఒత్తిళ్లు ఉండవని, ముక్కుసూటిగా పనిచేసుకుపోతుంటాడని, కార్పొరేషన్‌లో ప్రజలకు సంబంధించిన పనులు తొందరగా అవుతుంటాయనే అభిప్రాయం ఉండేది. దీనికి తగ్గట్లుగానే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు స్వయంగా చొరవ చూపి నెల్లూరు నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారి చక్రధర్‌బాబును కమిషనర్‌గా వేయించారు. కేంద్రం ద్వారా 1300కోట్ల హడ్కో నిధులను నెల్లూరుకు తెప్పించేందుకు వెంకయ్యనాయుడు ప్రతిపాదనలు పెట్టి ఉన్నారు. ఈ నిధులు మంజూరైతే వాటిని సద్వినియోగం చేయడానికి ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉంటే బాగుంటుందనే ఆలోచనతో వెంకయ్య ఆ పని చేశారు. చక్రధర్‌బాబు కమిషనర్‌గా వచ్చాక జిఎన్‌టిరోడ్డును విస్తరించే కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు అయ్యప్పగుడి నుండి ఆత్మకూరు బస్టాండ్ దాకా మార్కింగ్ చేయించారు. అలాగే నెల్లూరు చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దాలని, నగరంలోని పలు రోడ్లను విస్తరించాలని, నగర రూపు రేఖలను మార్చాలని చక్రధర్‌బాబు ఆశపడ్డారు.

అయితే అదే క్రమంలో ఆయన స్పీడు వల్ల రాజకీయంగానూ సమస్యలు ఎదురయ్యాయి. ముఖ్యంగా మేయర్ అజీజ్, కార్పొరేటర్లకు తెలియకుండా ఆయన స్టాండింగ్ కమిటి ఎన్నికల వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం వివాదాస్పదమైంది. ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా వేయడం వల్ల తనకు వీసమెత్తు విలువ లేకుండా పోయిందని అజీజ్ మంత్రి నారాయణ వద్ద పలుసార్లు బాధపడ్డాడు.

అజీజ్ బాధ చూడలేక ఈమధ్య మున్సిపల్ మంత్రి నారాయణ నెల్లూరొచ్చినప్పుడు... నెల్లూరు కార్పొరేషన్‌కు మేయరే సుప్రీం అని, అంతా ఆయన అదుపాజ్ఞలలో జరగాలని, ఆయన చెప్పిందే వేదమన్నట్లు మాట్లాడారు. పరోక్షంగా ఈ మాటలు మంచి ఊపుమీదున్న కమిషనర్ చక్రధర్‌బాబును హెచ్చరించినట్లయ్యింది.

అప్పటి నుండి చక్రధర్‌బాబు స్పీడు తగ్గించాడు. నగరంలోని అభివృద్ధి పనులు, సమస్యల విషయంలో చొరవ చూపడం లేదు. ఏదో మొక్కుబడిగా పని చేసుకుపోతున్నారు. దీంతో నెల్లూరుకు ఐఏఎస్ కమిషనర్ ఉద్దేశ్యమే నెరవేరే పరిస్థితి లేకుండా పోయింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





### ఎన్నికల దాకా...

## వెయిట్ అండ్ సీ

**గత ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన కాంగ్రెస్ నాయకులకు, అధికారం చేతులదాకా వచ్చి జారిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ నాయకులకు, అనుకోకుండా అధికారం చేతికందిన తెలుగుదేశం నాయకులకు మధ్య ఎలాంటి తేడా కనిపించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగుదేశం వాళ్ల కంటే వైకాపా నాయకులు, వీరికంటే కాంగ్రెస్ నాయకులు ప్రశాంతంగా వున్నారనుకోవచ్చు.**

తెలుగుదేశం అధికారంలోకి రాగానే ఇక జిల్లాలో వైకాపా, కాంగ్రెస్ ఖాళీ అవుతాయనుకున్నారు. ముఖ్యంగా వైకాపా నుండి గెలిచిన ఏడుమంది ఎమ్మెల్యేలలో నలుగురు ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి పోతారనే ప్రచారం జరిగింది. మొదట్లో ఆ ఊపు అలాగే వుండింది. అట్లాగే ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు గౌతమ్‌రెడ్డి బీజేపీలో చేరుతారనే వూహాగానాలు వెలువడ్డాయి. ఇక కాంగ్రెస్‌లో నుండైతే ఆనం సోదరులు, పనబాక కృష్ణయ్యలు తెలుగుదేశంలో చేరుతారనే ప్రచారం వచ్చింది.

ఇప్పుడు రాజకీయనాయకులకు అధికారమే పరమావధిగా మారింది. పార్టీ సిద్ధాంతం, జెండా, అజెండా, అభిమానం వంటివి ఎప్పుడో పోయాయి. కాబట్టి అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీలోకి మిగతా పార్టీల నుండి వలసలు పెద్ద లెక్కలేదు. అధికారంలోకి వచ్చిన కొత్తల్లో చాలామంది అలా వలసవెళ్లారు కూడా!

కాని రానురాను పరిస్థితులు మారుతున్నాయి. అధికారంలో ఉన్నామని చెప్పుకోవడానికి తప్ప తెలుగుదేశం నాయకులు విరగబొడుస్తున్నదేమీ లేదు. గట్టిగా రెండు లక్షల రూపాయల పనిని కూడా మంజూరు చేయించుకోలేకపోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సంపాదించుకునే మార్గాలు కూడా మూసుకుపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎర్రచందనం, ఇసుక, గనులు వంటివి నాయకుల పాలిట కాసుల కల్పవృక్షాలయ్యాయి. నాయకులు తలా నాలుగురాళ్లు సంపాదించుకున్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తమ పని కూడా అంతే జల్సాగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు ఆశపడ్డారు. కాని తీరాచూస్తే ఎర్రచందనం అక్రమ రవాణాను బిగించారు. ఇసుకను మహిళా సంఘాలకు అప్పగించి తెలుగుదేశం నేతల నోట్లో మట్టి కొట్టారు. అధికారుల ట్రాన్స్‌ఫర్‌ల ద్వారా కొంతమంది నాయకులు నాలుగు రూపాయలు సంపాదించుకున్నారు.

అధికారంలో వున్న తెలుగుదేశం నాయకుల దరిద్రాన్ని మిగతా పార్టీల నేతలు గమనిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఆ పార్టీలో చేరి బావుకునేదేమీ లేదనే ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుంది. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఎలా మారుతుందో తెలియదు. ఆరోజు పరిస్థితిని బట్టి భవిష్యత్‌ను నిర్ణయించుకోవచ్చనే ఆలోచనలో ఇతర పార్టీల నేతలున్నారు. వచ్చే ఎన్నికల దాకా వెయిట్ అండ్ సీ ధోరణిలో వీళ్లున్నారు.

# శాంతా బయోటెక్స్ వరప్రసాద్‌రెడ్డికి ఎల్లాప్రగడ అవార్డు



**నెల్లూరు జిల్లా గర్వించదగ్గ పారిశ్రామిక వేత్త, మనందరికీ సుపరిచితుడు శాంతా బయోటెక్స్ అధినేత డా॥ కె.ఐ.వరప్రసాద్ రెడ్డికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డు లభించింది. 2015 సంవత్సరానికి గాను ఈ అవార్డును హైదరాబాద్‌లోని శాంతా బయోటెక్స్ ఫౌండర్ ఛైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డికి ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మెన్ డా॥ జగదీష్ తెలిపారు.**

డా॥ వరప్రసాద్‌రెడ్డి నెల్లూరుజిల్లా వాసి, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి లాబొరేటరీ నుండి షాన్‌వాక్‌బి, షాన్‌ఫెరాన్, స్ట్రెప్టోకినాసే షాన్ పోయిటిన్, షాన్‌టెట్రా, షాన్5 వ్యాక్సిన్‌లు, మందులు వెలువడ్డాయి. శాంతా బయోటెక్స్ రూపొందించిన మందులు ప్రజలకు అందుబాటులో ఉండటం విశేషం. డా॥ వరప్రసాద్‌రెడ్డి ఫార్మా విభాగంలో చేసిన కృషికి గాను గతంలో పలు ప్రతిష్ఠాత్మక మైన అవార్డులు అందుకున్నారు. వీటిలో ప్రధానంగా భారత ప్రభుత్వం నుండి 2005లో 'పద్మభూషణ్', 2003లో నేషనల్ టెక్నాలజీ అవార్డ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, డా॥ రామినేని ఫౌండేషన్ విశిష్ట పురస్కార్(2000)లు ఉన్నాయి. పలు ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ, కార్పొరేట్ కంపెనీలలో ఆయన సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 31 సాయంత్రం నారాయణ మెడికల్ కాలేజీలో జరిగే అవార్డు కార్యక్రమంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలెకులర్ బయోలజీ డైరెక్టర్ డా॥ సిహెచ్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డు ప్రదానం చేస్తారని, నారాయణ మెడికల్ కాలేజీ రీసెర్చ్ డైరెక్టర్ డా॥ జి.సుబ్రహ్మణ్యం గౌరవఅతిథిగా పాల్గొంటారని జగదీష్ తెలిపారు.

**మందుల మాంత్రికుడు సుబ్బారావు...**

డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు 1930లో ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీ నుండి పిహెచ్‌డి పొందారు. వీరి ప్రతిభను గుర్తించి అమెరికాలోని లెదర్లీ లాబొరేటరీ ఈయనను డైరెక్టర్‌గా నియమించింది. వీరి ఆధ్వర్యంలో 400 మంది అమెరికన్లు పరిశోధనలు చేసేవారు. డా॥ సుబ్బారావు రూపొందించిన్ని మందులు ప్రపంచంలో ఏ శాస్త్రవేత్త చేసి వుండరు. ఫైలేరియాకు హెట్రోజన్, క్షయవ్యాధికి ఇనోనెక్స్, పిల్లల్లోని బ్లడ్‌క్యాన్సర్‌కు మెతోట్రెక్సేట్, ఆరోమైసిన్, కలరా, టైఫాయిడ్, ప్లేగ్ నివారణకు టెట్రాసైక్లిన్, స్ప్రూ నివారణకు పోలిక్ ఆసిడ్ మొదలైనవి డాక్టర్ సుబ్బారావు సృష్టే. డా॥ సుబ్బారావు గౌరవార్థం లెదర్లీ రూపొందించిన డ్రగ్ పేరును సుబామైసిన్‌గా పేరు పెట్టారు.

1875 జనవరి 12న భీమవరంలో జన్మించిన ఎల్లాప్రగడ 1948 ఆగస్టు 9న కాలం చేశారు. యావత్ తెలుగుజాతి గర్వించ తగ్గ శాస్త్రవేత్త డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డును అందు కుంటున్నందుకు వరప్రసాద్‌కు 'లాయర్' అభినందనలు.

# ఆరునెలలకొకసారి రక్తదానం




ప్రతి ఒక్కరూ ఆరు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని వాసవిక్లబ్, జేసిఐ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమని, అటువంటి రక్తాన్ని దానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనార్ మోటివేటర్ బయ్యా ప్రసాద్, పేరూరి మల్లిఖార్జునరావు, జగన్‌మోహన్, వేమూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

# శీనయ్య ఫ్లెక్సీల వేడుక




తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇటీవల పుట్టినరోజు పండుగ చేసుకున్నారు. అయితే ఈసారి స్పెషల్ ఏంటంటే గతంలో ఎన్నడూ లేనట్లుగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో శీనయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు వెలిసాయి. నెల్లూరులో చంద్రబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఆనం వివేకానందరెడ్డి వంటి నాయకుల పుట్టినరోజప్పుడు కూడా ఇన్ని ఫ్లెక్సీలు కట్టలేదు. తన బర్త్‌డే రోజు శీనయ్య హిందూపురం వెళ్లి తన అభిమాన నాయకుడు బాలకృష్ణ ఆశీస్సులు తీసుకోవడం విశేషం. గతంలో ఎప్పుడూ లేనట్లు ఈసారే శీనయ్య బర్త్‌డేకు ఇన్ని ఫ్లెక్సీకటౌట్‌లు ఎందుకు కట్టారో అంతుబట్టడం లేదు.

# మార్చిలో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

వచ్చే మార్చి నెలలో నెల్లూరులో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు తోట మనోహర్ తెలిపారు. దివంగత నాయకులు ఏసి సుబ్బారెడ్డికి, ఇటీవల మృతిచెందిన ప్రముఖ క్రీడాకారుడు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ కొండలరావు చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండలరావు హ్యాండ్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

## సతీష్‌ధావన్ శాస్త్రవేత్తగా శేషగిరిరావు

సతీష్‌ధావన్ శాస్త్రవేత్తగా ఫిబ్రవరి నెల 1వ తేదీ నుంచి ఏడాదిపాటు పనిచేసేలా బెంగుళూరులోని ఇస్రో కేంద్ర కార్యాలయం నుండి వెల్లంకి శేషగిరి రావుకు ఉత్తర్వులు అందాయి. ఈయన షార్ సహనిర్దేశకులుగా ఈ నెల 31వ తేదీన ఉద్యోగవిరమణ చేయనున్నారు. ఆయన సేవలను, ప్రతిభను, షార్‌లో సుదీర్ఘ అనుభవాన్ని గుర్తించి సతీష్‌ధావన్ శాస్త్రవేత్తగా నియమించారు.

## విఆర్వోల సమాచారంతో ఫ్లెక్సీ ఏర్పాటు

నెల్లూరు రూరల్, నగర ప్రాంతాలకు సంబంధించి విఆర్వోల వివరాలకు సంబంధించిన సమాచారం తెలియజేస్తూ నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

ప్రాంతం, సంబంధిత విఆర్వో ఫోను నెంబరు, తదితర వివరాలను ఆ ఫ్లెక్సీలో పొందుపరిచారు. తహశీల్దార్ కార్యాలయంలో పలు విభాగాలకు సంబంధించి కార్యాలయ గదులు తెలిసేలా సూచికగుర్తులను కూడా ఏర్పాటు చేశారు.

# బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు




గుంటూరు పట్టణంలో ఇటీవల జరిగిన జూనియర్ మిస్టర్ ఆంధ్ర, సీనియర్ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో నెల్లూరుజిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లా నుండి 9విభాగాలలో సీనియర్, జూనియర్లు 18మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 7మంది విజేతలుగా నిలిచి మెడల్స్ సాధించారు.

జూనియర్ విభాగంలో 55కేజీల విభాగంలో పి.లక్ష్మీ నారాయణ సిల్వర్‌మెడల్, 80కేజీల విభాగంలో హార్సిలీ సిల్వర్ మెడల్, 90కేజీల విభాగంలో మేఘశ్యామ్ సిల్వర్ మెడల్ సాధించారు.

సీనియర్ విభాగంలో 60కేజీల విభాగంలో ఎ.రజనీకాంత్ గోల్డ్‌మెడల్, 55కేజీల విభాగంలో వై.శ్రీనివాసులు సిల్వర్‌మెడల్, 65కేజీల విభాగంలో ఇ.వంశీ బ్రాంజ్ మెడల్, 85కేజీల విభాగంలో టి.సునీల్ బ్రాంజ్‌మెడల్ సాధించారు.

ఈ పోటీలకు టీం మేనేజర్‌గా డివి పవన్‌కుమార్, టీం కోచ్‌గా కె.నాగరాజారావు, అఫిషియల్స్‌గా బి.జగన్, డి.రాధా కృష్ణారెడ్డి వ్యవహరించారు.

# నెల్లూరు కబుర్లు

## హరనాథపురంను దత్తత తీసుకున్న మంత్రి




స్మార్ట్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని హరనాథపురంను దత్తత తీసుకున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి డాక్టర్ పి.నారాయణ ప్రకటించారు. ఈనెల 18వతేదీ నెల్లూరు హరనాథపురం ఓఆర్‌ఎం పాఠశాల ప్రాంగణంలో స్మార్ట్‌వార్డ్ గురించి ఆయన అధికారులతో, ప్రజాప్రతినిధులతో, వార్డ్ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతోమంది గ్రామాలలో పట్టణాలలో చదువుకొని ఆర్థికంగా పరిపుష్టి పొందినవారున్నారని, వారిని గుర్తించి వారు పెరిగిన గ్రామాలలో లేదా వార్డులలో అభివృద్ధికి వారివంతు విరాళం ఇచ్చేలా చూడాలన్నారు.

ఎల్‌ఇడి బల్బులు అన్ని పురపాలక సంఘాలలో రాష్ట్ర వ్యాప్తంగా జూన్ మాసం నాటికి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్మార్ట్‌వార్డ్ గురించి చేయవలసిన కార్యక్రమాల గురించి వివరంగా ప్రజలకు తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ శ్రీమతి జానకి, నగర కమిషనర్ చక్రధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలియో నిర్మూలనే రోటరీ ఆశయం



"రోటరీ ఆశయం – ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలించడం" అనే ధ్యేయంతో ప్రపంచ వ్యాప్తంగా రోటరీ ఇంటర్నేషనల్ వారు 5400 కోట్లు వెచ్చించి పోలియో మహమ్మారిని నిర్మూలించి పోలియో రహిత సమాజం కోసం కృషి చేస్తున్నారు. ఈనెల18న జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో నెల్లూరు రోటరీక్లబ్ వారు ఆర్‌టిసి బస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్, ముత్తుకూరు బస్టాండ్, రోటరీక్లబ్ సెంటర్లలో పల్స్‌పోలియో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలలో 1320మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. రోటరీ పల్స్‌పోలియో కో–ఆర్డినేటర్లు ఎస్.రాఘవేంద్రషెట్టి, కె.వి.సుబ్బారెడ్డి, ముస్తాక్ అహమ్మద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్‌పోలియో శిబిరాలలో రోటరీ అధ్యక్షులు కె.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ప్రతాప్‌కుమార్, రొటేరియన్స్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, అనిల్, జగన్నాథంశెట్టి, విశ్వం, టి.శేఖర్, నారాయణ, జయప్రకాష్, కృష్ణమూర్తి తదితర రొటేరియన్లు పాల్గొన్నారు.

## పిసిసిలో నెల్లూరుజిల్లా వాసులు



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పిసిసి)లో నెల్లూరుజిల్లా వాసులకు చోటు లభించింది. పార్టీ అధిష్టానం చేపట్టిన నియామకంలో పనబాక కృష్ణయ్య, నందిమండలం భానుశ్రీ, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలు ముగ్గురు పిసిసి ప్రధానకార్యదర్శులుగా నియమితులయ్యారు. డిసిసి అధ్యక్షుడిగా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు కొడవలూరు ధనుంజయరెడ్డిని కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఆనం కుటుంబంలో ఒకరైన ఏసి సుబ్బారెడ్డిని నెల్లూరు సిటి కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించింది.


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.జానకి

## విద్యార్థులు చదువుకుని అభివృద్ధి చెందాలి

విద్యార్థులు బాగా చదువుకొని అభివృద్ధి చెంది, వారు పెరిగిన గ్రామానికి, పట్టణానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.జానకి అన్నారు. ఆమె కృష్ణాపురం నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినీవిద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకొని నెల్లూరుజిల్లాలో వున్న నవోదయ విద్యాలయానికి పేరు తేవాలన్నారు. ఈసారి విద్యాలయానికి వచ్చి పూర్తిగా విద్యార్థులతో అన్ని విషయాలు చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పి. హెలెన్‌మేరి, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

## అందర్నీ ఆకర్షించిన 'డాగ్‌షో'


డాగ్‌షోను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరులో ఈ నెల 18న విఆర్‌సి మైదానంలో జరిగిన పెంపుడు కుక్కల ప్రదర్శన అందరినీ బాగా ఆకట్టుకుంది. నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ డాగ్‌షో జరిగింది. పలు రకాల జాతులకు చెందిన పెంపుడు కుక్కలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనను తిలకించేందుకు జంతుప్రేమికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ ప్రారంభోత్సవం చేశారు. మొత్తం 31విభాగాల్లో 21రకాల జాతులకు చెందిన సుమారు నూరు కుక్కలను ఈ ప్రదర్శనలో ప్రవేశపెట్టారు. ఉత్తమంగా ఎంపికైన వాటికి న్యాయనిర్ణేత సుభకర్ బహుమతులను ప్రకటించారు. నెల్లూరుకు చెందిన బిఎల్ కార్తీక్-పూజ దంపతులు తీసుకువచ్చిన బీగెల్ అనే పెంపుడు కుక్క ప్రథమస్థానం సాధించి ఛాంపియన్‌గా నిలచింది. నగరంలోని శెట్టిగుంటరోడ్డుకు చెందిన ఆర్.రవితేజకు చెందిన పెంపుడుకుక్క ద్వితీయ స్థానం సాధించగా, బాలాజీకి చెందిన పెంపుడు కుక్క తృతీయస్థానం సాధించింది. నాల్గవ స్థానం ఇర్ఫాన్ అనే వ్యక్తికి చెందిన పెంపుడుకుక్కకు, ఐదవ స్థానం కోవూరుకు చెందిన విజయ్ అనే వ్యక్తికి చెందిన పెంపుడుకుక్కకు లభించాయి. పశుసంవర్ధకశాఖ జాయింట్‌డైరెక్టర్ శ్రీధర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ విజయకుమార్, కార్యదర్శి సురేంద్రకుమార్, కోశాధికారి రాజా, వైద్య సలహాదారు వెంకటస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణపట్నం పోర్ట్‌కు చెందిన జూలీ, సీజర్ అనే పెంపుడు కుక్కల విన్యాసాలు అందరినీ అలరించాయి.

# కదిలాయి జగన్నాథ రథచక్రాలు



నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో నాల్గవసారి జగన్నాథ రథచక్రాలు కదిలాయి. సోమవారం మధ్యాహ్నం నెల్లూరు నవాబుపేట శివాలయం నుండి హరేకృష్ణ... హరేకృష్ణ... కృష్ణకృష్ణ హరేహరే... హరేరామ హరేరామ రామరామ హరేహరే... అంటూ నామ సంకీర్తనలతో సింహపురి వీధులు మార్మోగాయి. కోలాటాలు, భజనలు, కీర్తనలు కోలాహలంతో జగన్నాథుడి రథయాత్ర నెల్లూరు ప్రధాన వీధుల మీదుగా సాగి భక్తులకు కనువిందు చేసింది. ఈ రథయాత్రలో నగర ప్రముఖులతో పాటు దేశవిదేశాల నుంచి పలువురు మందిర అధ్యక్షులు, భక్తులు హాజరయ్యారు. నవాబుపేట శివాలయం నుండి రథయాత్ర ప్రారంభమై స్టోన్‌హౌస్‌పేట, విజయమహల్‌గేటు, గాంధీబొమ్మ, ఆర్టీసీ మీదుగా కస్తూరిదేవి విద్యాలయం వరకు సాగింది. రథంలో శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్రలు విశేష అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నగర వీధులన్నీ భక్తులతో కిక్కిరిసాయి. దారి పొడవునా మహిళాభక్తులు రంగవల్లులు వేసి పూలు చల్లుతూ రథయాత్రకు స్వాగతం పలికారు. ప్రధాన సెంటర్లలో స్థానికులు ప్రసాదాలు, మంచినీరు, మజ్జిగ సరఫరా చేశారు. తొలుత నవాబుపేట శివాలయం వద్ద జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఇస్కాన్ అంతర్జాతీయ ప్రతినిధులు భానుస్వామి (జపాన్), భక్తరూపదాస్(అమెరికా) ఏపీ ఇస్కాన్ జోనల్ కార్యదర్శి శంఖరీదాస్, ఇస్కాన్ బ్యూరో ఛైర్మెన్ రేవతి రమణదాస్ నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షులు సుఖదేవస్వామిలు ప్రత్యేకపూజల అనంతరం రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఉపదేశిస్తూ కలియుగంలో హరినామ సంకీర్తనే మానవులను భగవంతునికి చేరువచేస్తుందన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలను పాటిస్తే జీవితాలను ఆనందమయం చేసుకోవచ్చన్నారు.

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఆనం జయకుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

### జగన్నాథ రథయాత్రకు
## వేమిరెడ్డి 2 లక్షల విరాళం



నెల్లూరులో అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నెల్లూరు మందిరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శ్రీ జగన్నాథ రథయాత్రకు తరలి వచ్చిన భక్తుల అన్నప్రసాదాల కోసం ప్రముఖ పారిశ్రామికవేత్త, రథయాత్ర ముఖ్య పోషకులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రెండు లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ నెల 19న ఇస్కాన్ మందిరం అధ్యక్షులు సుఖదేవస్వామి మాట్లాడుతూ ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జగన్నాథ రథయాత్రకు విశేష తోడ్పాటు అందించారని తెలిపారు. రథయాత్రలో వేలాదిగా భక్తజనులు పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. ఈ సందర్భంగా, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఇస్కాన్ కేంద్ర గవర్నింగ్‌బాడీ కమిషనర్ పూజ్యశ్రీ భానుస్వామి మహరాజ్ అభినందించి, వేమిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

## తెలుగు ఆణిముత్యానికి భారతరత్న ఇవ్వాలి


ప్రసంగిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని, అలాంటి మహోన్నత నేతకు భారతరత్న ఇవ్వాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్లపాక రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో ఎన్టీఆర్ 19వ వర్ధంతి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, జడ్.శివప్రసాద్, నూనె మల్లికార్జున యాదవ్, నందమూరి అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, అంచల వాణి, మండవ రామయ్య, ధర్మవరం సుబ్బారావు, వైవి సుబ్బారావు, పమిడి రవికుమార్ చౌదరి, కార్పొరేటర్లు మామిడాల మధు, మేకల రజని, అంచూరు జానకి, ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

- జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్


రహదారి భద్రతావారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ ఇంతియాజ్, ఎస్పీ సెంథిల్‌కుమార్

రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని జాయింట్ కలెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్ అన్నారు. నెల్లూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 19న రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన 26వ రహదారి భద్రతా వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లు, బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం, జేసీ మాట్లాడుతూ రోజురోజుకూ ప్రమాదాలు పెరిగిపోతూనే వున్నాయని, రోడ్లపై ప్రయాణించేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు.

జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో నిర్లక్ష్యం వల్ల, నిబంధనలు పాటించక పోవడం వల్ల అధికశాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవింగ్‌చేసే సమయంలో మద్యం సేవించడం, అతి వేగంగా వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూనే సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఆయన అన్నారు. నెల్లూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలను ఈ నెల19 నుంచి 25వ తేది వరకు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ డిఎస్పీ జనార్దన్, ఏ.పి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలనాయుడు, కార్యదర్శి నారాయణ, మోటార్ వాహనాలు అధికారులు మురళీమోహన్, జయప్రకాష్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరచిన రక్షకదళ విన్యాసాలు



నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నంపోర్టుకు ఆదివారం సముద్ర పహెరెదర్ నౌక చేరుకుంది. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డు సిబ్బంది సముద్రంలో విధులు ఎలా నిర్వర్తిస్తారో తెలియజేశారు. నెల్లూరుజిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చినవారికి తీరం నుంచి నాలుగు నాటికల్ మైళ్ల దూరంలో అవగాహన కల్పించారు. గుర్తు తెలియని బోట్లు, చొరబాటుదారులు వచ్చినప్పుడు ఏ విధంగా స్పందిస్తారో తెలిపారు. నౌకలోని ప్రత్యేక బోటు ద్వారా కాల్పులు, తుపాకీతో కాల్చడం, వాటర్ స్కూటర్, రాకెట్ లాంఛర్ ప్రయోగం ప్రత్యక్షంగా ప్రదర్శించారు. వీడియో చిత్రాల ద్వారా పలు అంశాలను వివరించారు. నౌకను సందర్శించేందుకు వీక్షకులు క్యూ కట్టారు.

# బాధ్యతాయుతంగా పనిచేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రజావిజ్ఞప్తుల దినంలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జానకి ఈ నెల 17వ తేదీ వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో రవీందర్, డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడివోలు హాజరయ్యారు. మీ కోసం ఏపిజివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ప్రతి వినతిని పొందు పరచాలని సూచించారు. తద్వారా వినతుల స్థితిగతులను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సేవా కార్యక్రమాలతో ఎన్టీఆర్ వర్ధంతి



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బల్లి దుర్గాప్రసాద్, జ్యోత్స్నలత, పొనకా దేవసేన, శీలం కిరణ్‌కుమార్

గూడూరు పట్టణంలోని పలు కూడళ్లలో తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 19వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గడియారం స్థంభం వద్ద మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశంపార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, బాలిబోయిన రమేష్, కల్పన, మస్తానమ్మ, విజయమ్మ, భానుప్రకాష్, బొల్లినేని కోటేశ్వరరావు, వెంకట్రావు, బయ్యా మోహన్‌రావు, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్‌టియు డైరీ ఆవిష్కరణ



పిఆర్‌టియు 2015 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను, బ్యాగులను చిల్లకూరు మండలం, ఏరూరు గ్రామంలోని వ్యాపారవేత్త ఎల్.సునీల్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువమంది విద్యార్థులు చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి.మాధవయ్య, జిల్లా కార్యదర్శి ఎమ్.ఎల్.సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, కె.సిద్ధయ్య, మండల అసోసియేట్ అధ్యక్షులు పి.వి.కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





### కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# కోదండరాముడికి తెప్పోత్సవం

గూడూరు కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయం తెప్ప కోనేరులో కనుమ పండుగ సందర్భంగా ఇటీవల స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి తండ్రి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం రూ.80లక్షలతో తెప్పకోనేరును అభివృద్ధి పరిచారు. ఏటా కనుమరోజు తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో టిటిడి వేదపండితులు స్వామివారికి సంప్రోక్షణం, పుణ్యాహవచన కార్యక్రమాలను నిర్వహించారు. శాంతి హోమాలు జరిపారు. అనంతరం విద్యుద్దీపాలతో అలంకరించిన హంస వాహనంపై స్వామివారిని ఉంచి బాణాసంచా పేలుస్తూ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయ దాతగా కనుమూరు హరిచంద్రారెడ్డి వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పారిశ్రామికవేత్త పొనకా శివ కుమార్‌రెడ్డి, ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, కె.మునిగిరీష్, డాక్టర్ సిఆర్‌రెడ్డి, కనుమూరు రవిచంద్రారెడ్డి, బద్రిగిరి, మనపాటి రవీంద్రబాబు, సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐలు బాబి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో గూడూరు చిన్నారులు

# విద్యా ప్రదాత..నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి



నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యా ప్రదాత అని, పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు ఆయన చేసిన సేవలు నిరుపమానమైనవని వైఎస్సార్సీపి సీజీసి సభ్యులు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి ప్రశంసించారు. వాకాడులో ఈ నెల 15న బాలకృష్ణారెడ్డి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, స్వర్ణముఖి నది ఒడ్డున వున్న బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత, బాలకృష్ణారెడ్డి మనుమడు చిన్నా (జితేంద్రరెడ్డి) కేక్‌ను కట్‌చేసి తాతగారి ఆత్మీయమైన జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు.

ఈ సందర్భంగా పద్మనాభరెడ్డి మాట్లాడుతూ పేదలు, దళితవర్గాలవారికి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పిసిసి కార్యవర్గ సభ్యులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శతజయంతి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్సీపి నేత, రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శి కొండారెడ్డి నందగోపాలరెడ్డి, జడ్పీటిసి సభ్యురాలు బత్తిన ప్రమీల, కోఆప్షన్ సభ్యులు రియాజ్, వైఎస్సార్సీపి నాయకులు పి.మనోజ్ కుమార్‌రెడ్డి, కె.రామలింగారెడ్డి, డి.రాజశేఖరరెడ్డి, ఎన్.పెంచల రెడ్డి, పి. గోపాలరెడ్డి, నజీర్‌బాషా, హమీద్, కె.శ్రీనివాసులు, కె. మధురెడ్డి, అజయ్‌కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వెటరన్ క్రికెట్ పోటీలు



విన్నర్స్, రన్నర్స్ జట్లకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన వెటరన్ క్రికెట్ పోటీలు ఇటీవల ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జీవితకాలంలో అన్ని రంగాల్లో ప్రతిఒక్కరూ ముందుండాలని ఆకాంక్షించారు. డిఎస్పీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగరోజుల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా మిత్రులను కలుసుకోవడం సంతోషకరమని చెప్పారు. అనంతరం కనుమూరు హరిచంద్రారెడ్డి, కొణిదల మునిగిరీష్, అనిల్, చంద్రయ్య తదితరులు మాట్లాడారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు విధి నిర్వహణలో సామర్థ్యం బాగుండినా అధికారులను గమనించి పోవలసి వస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి క్రొత్త ప్రాజెక్టులు, అవకాశాలు దొరకవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను, ఇబ్బందులను అధిగమిస్తారు. ఆర్థిక స్థితి మెరుగై ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బాధ్యతాయుతమైన పదవులు అధికారాలు లభిస్తాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. స్థలాలు ఇండ్లు కొనుగోలుపై దృష్టి పెడతారు. దూకుడుగా వ్యవహరించడం దూకుడుగా మాట్లాడటం తగ్గించుకొనండి. చిన్నచిన్న సమస్యలు కుటుంబసభ్యులతో రావచ్చును. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్యం, ఆహారం పట్ల శ్రద్ధ చూపండి. హామీలు, ప్రతివాదనలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారులకు ఉద్యోగులకు అధికారుల తనిఖీలుంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు కలిగి పునరాలోచనలతో నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్థిక వ్యవహారాలను వాయిదా వేయడం మంచిది. ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి – మీ వాసి

తేది. 23.01.2015 నుండి
తేది. 29.01.2015 వరకు

ఈ వారము మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, మకరంలో రవిబుధులు, కుంభంలో కుజ శుక్రులు, కుంభ, మీన, మేష, వృషభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 26 సోమవారము రథసప్తమి మరియు రిపబ్లిక్‌డే దినోత్సవం

**ముహూర్తము:**

తేది 29 గురువారము రాత్రి గంట 2.50 నుండి గంట 5.06లోగా వివాహ, గృహప్రవేశ గృహారంభములకు ధనుర్లగ్నము.

**మాఘ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | తదియ | మ॥ గం.1.12వ॥ |
| తేది. 24 | శని | చతుర్థి | ఉ॥గం.10.42వ॥ |
| తేది. 25 | ఆది | పంచమి | ఉ॥గం.8.32వ॥ |
| | పిదప | షష్ఠి | పూర్తిగ |
| తేది. 26 | సోమ | సప్తమి | రా॥గం.4.22వ॥ |
| తేది. 27 | మంగళ | అష్టమి | రా॥గం.2.48వ॥ |
| తేది. 28 | బుధ | నవమి | రా॥గం.1.28వ॥ |
| తేది. 29 | గురు | దశమి | రా॥గం.1.02వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బిడ్డల విద్యా ఉద్యోగ వివాహ విషయాలపై దృష్టి పెడతారు. భాగస్వామ్య వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. పొదుపు పథకాలపై నిర్ణయాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో విశ్రాంతి దొరకదు. ఆదాయం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదాపడటం మంచిది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు నిర్ణయం కాగలవు. బంధుమిత్రుల మాటలు కొద్ది మనస్తాపం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారవృద్ధికి కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఆదాయం పెరుగుతుంది. సమావేశాలలో మీ సూచనలు ఆమోదింపబడగలవు. కోర్టు కేసులందు అనుకూలత, రావలసి బాకీలు కొంత లభించడం, అనుకున్న పనులను సాధించుకొనడం జరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుముఖ్యులకు అనారోగ్య బాధలు, కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. అనుకున్న పనులను జాగ్రత్తగా నిర్వహించినా చిన్నచిన్న ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు బాధ్యతల మార్పులు, అధికారులతో సఖ్యత బాగుంటుంది. నూతన వ్యాపారాలు, పెట్టుబడుల మీద దృష్టి పెడతారు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు పొందుతారు. శుభవార్తలు వినడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పనులు, కార్యక్రమాలు హడావిడిగా జరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరపడం ఉండవచ్చును. అనుకోని ఖర్చుల వల్ల కొంత ఇబ్బందిపడతారు. వృత్తి పరంగా అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వృద్ధికి అవకాశాలు అందివచ్చి రాబడి పెరగగలదు. కుటుంబసభ్యులతో కొంత అభిప్రాయ భేదాలుండి సర్దుకుంటాయి. షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులను పట్టుదలతో సాధించుకొంటారు. కుటుంబసభ్యులతో విభేదాలు రాకుండా సర్దుకొనిపోవాలి. రాబడి, ఖర్చులు అంచనాలను రూపొందించుకొని ఆర్థికస్థితిని బాగుచేసికొంటారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వృత్తిజీవనంలో వ్యాపకం బాగుంటుంది. వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి. అప్పులు, హామీలు ఇచ్చి చిక్కుకొనవద్దు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

గృహ మార్పులు, గృహ వస్తువాహన రిపేర్లుండగలవు. నిర్మాణాలు చేపట్టిన వారికి వర్కర్లతో సమస్యలుండగలవు. ఆర్థిక ఒప్పందాలలోనూ, చెల్లింపుల విషయంలో జాగ్రత్తపడండి. వాణిజ్య వృత్తి రంగాలలో జీవమున్న వారికి ఆర్థికంగా గడ్డు పరిస్థితి. ఖర్చులు బాగా పెరుగుతాయి. ఋణాలు చేయవలసిరావచ్చును. పనులందు పట్టుదలకు పోకుండా చూసి చూడనట్లుగా ఉండటం మంచిది. ఆరోగ్యస్థితి బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

నిర్మాణాలు చేపట్టడం, స్థిరాస్తుల లావాదేవీలు చేస్తారు. గృహ వస్తు వాహన రిపేర్లు జరుగగలవు. న్యాయ వ్యవహారాలలో ఇబ్బందులుండగలవు. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనా విధానం అవసరం. వ్యాపారవర్గాలకు అవకాశాలు తగ్గిపోవచ్చును. రాబడి అసంతృప్తిగా ఉంటుంది. ఇతరుల వల్ల మోసగింపబడటం గాని ఇబ్బంది పడటం గాని ఉండవచ్చును.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా బాగుంటుంది. కరెంటు, మిషన్లు, వాహనాలు రిపేర్లు చేసేవారు, వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి. క్రొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు, క్రొత్త వ్యాపారాల ఆలోచనలుంటాయి. అనుకున్న పనుల మీద స్థిర నిర్ణయాలు తీసికొనలేక టెన్షన్ పడతారు. మొగమాటాలుపడి ఇబ్బందులు తెచ్చుకొనే అవకాశం ఉన్నది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొనండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు పబ్లిక్‌తోను, అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. కుటుంబసభ్యులతో కొంత చికాకులుంటాయి. ఆస్తి పంపకాలు, ఆస్తుల కొనుగోలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపారాలలో క్రమంగా నిలబడతారు. ఆర్థికముగా అవకాశాలు బాగుంటాయి. అనారోగ్య ఖర్చులు, పనులు జరుపుకొనేందుకు పెట్టే ఖర్చులు పైనబడినా ఆర్థికంగా ఇబ్బందులుండవు. షేర్ల మీద స్వల్ప లాభాలుంటాయి.

# వైఎస్సార్‌కు ఘన నివాళి



సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్సీపి యువజన విభాగం వారు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, నూతన వస్త్రాలను సమర్పించారు. వైఎస్సార్సీపి నగర నియోజకవర్గ కార్యాలయంలో, ఆ విభాగం నగర అధ్యక్షుడు గంధం సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యార్థుల సంక్షేమానికి చేపట్టిన పలు పథకాలను వివరిస్తూ, వైఎస్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు వి. శ్రీనివాసులురెడ్డి, బెల్లంకొండ హరిప్రసాద్‌నాయుడు, పెంచలరెడ్డి, రహంతుల్లా, ప్రసన్నకుమార్, సుకుమార్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో మరికొందరికి బాధ్యతలు

వైఎస్సార్సీపి జిల్లా కమిటీలో మరికొంతమందిని నియమిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆమోదముద్ర వేశారని జిల్లా పార్టీ అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్టమూరు పద్మనాభరెడ్డి, కార్యదర్శులుగా చిల్లకూరు సుధీర్ రెడ్డి, కనుపూరు కోదండరామిరెడ్డి, పెళ్ళూరు సుధాకర్‌రెడ్డి, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, తెనాలి నిర్మలమ్మ, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, యల్లసిరి రాజీవ్‌రెడ్డి నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా కోడూరు దిలీప్‌రెడ్డి, ఇసనాక రమేష్‌రెడ్డి, టంగుటూరు శ్రీనివాసులురెడ్డి, వెలిబోయిన వెంకటేశ్వర్లు, కోడూరు ప్రదీప్‌రెడ్డి, పఠాన్ ఖయ్యూంఖాన్, అల్లూరు గోపాల్‌నాయుడు, ఎన్.శ్రీలత, కాకుటూరు లక్ష్మణ్‌రెడ్డి, మారు సుధాకర్‌రెడ్డి, అనంతరాజు వేణుగోపాల్, పోలిరెడ్డి చిన్నప్పరెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, సానంపూడి సురేంద్రరెడ్డి, కట్టా విజయమోహన్‌రెడ్డి, కొణిదిన మోహన్‌నాయుడు, చందులూరు శ్రీనివాసులుయాదవ్, చేవూరు హోసూరయ్యయాదవ్ నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, వైఎస్సార్సీపి జిల్లా యువత కార్యదర్శిగా చింతంరెడ్డి శివకుమార్‌రెడ్డి నియమితులయ్యారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నగరాన్ని స్మార్ట్ సిటీ చేస్తాం

**- మేయర్ అజీజ్**

నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని, అందుకు ప్రజల సహకారం ఎంతైనా అవసరమని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్‌వార్డుల్లో భాగంగా ఆదివారం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీని టిడిపి రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు అందాల్సిన అన్ని మౌలిక వసతులు అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఇంతియాజ్, కార్పొరేషన్ కమిషనర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ నగరాభ్యున్నతికి అందరి కృషి అవసరమని, దాతలు ముందుకు వచ్చి వార్డులను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని 51వ వార్డును జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, 52వ వార్డును మేయర్ అబ్దుల్ అజీజ్ దత్తత తీసుకున్నారు. టిడిపి నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, కార్పొరేటర్లు మామిడాల మధు, ప్రశాంతికుమార్, శైలజలతో పాటు నాయకులు షంషుద్దీన్, జహీర్, సూరి, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనాథాశ్రమంలో అన్నదానం



నెల్లూరుజిల్లా ముస్లిం సేవాకమిటి స్థాపించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నెల్లూరు మూలాపేట బట్వాడిపాళెంలోని లిటిల్ హార్ట్ అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం, పండ్లు, స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలోని చిన్నపిల్లల ఆసుపత్రిలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు సంస్థ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఖాలీద్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా నెల్లూరుజిల్లాలోని మైపాడు, ముంగమూరు గ్రామం, క్యాన్సర్ హాస్పిటల్, టిబి హాస్పిటల్, జూబ్లీ హాస్పిటల్, మేరీ ఆశ్రమం, నెహ్రూ భారతి ఆశ్రమం, అంధుల పాఠశాల, అనేక పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ యండి ఖలీల్, మున్నా, పి.అస్లాంఖాన్, ఇసాక్, ఏజాజ్, హమీద్, పఠాన్‌గౌస్, గయాజ్, అలీం, నిసార్, పి.నాసర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# వరుణ్‌తేజ్ జన్మదిన వేడుక



మెగా బ్రదర్ నాగబాబు తనయుడు మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మానసిక వికలాంగుల పాఠశాలలో నెల్లూరు జిల్లా వరుణ్‌తేజ్ యువత, చిరంజీవి యువత ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు వై.రవికుమార్, వరుణ్‌తేజ్ యువత సభ్యులు గున్నం వేణు, చిరంజీవి ఐ బ్యాంక్ అధ్యక్షులు వి.వి.సుధీర్, మంచు మురళిరెడ్డి, ఆదిశేషయ్య, చక్రి, ప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ సి.హెచ్.కృష్ణవేణి, మేనేజర్ కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ శ్రీమతి జి.మాధురి, ఫిజియోథెరపిస్ట్ జి.వాసు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న క్రీడా, ముగ్గుల పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న మాగుంట శరశ్చంద్రారెడ్డి

నెల్లూరు మాగుంట లే అవుట్ సరస్వతినగర్‌లోని డా॥ సి.వి.రామన్ స్కూల్ ఆవరణలో ఈ నెల 12 నుండి 14వరకు మాగుంట శరశ్చంద్రారెడ్డి తన స్వంత నిధులతో క్రీడా, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు కబడ్డి, షాట్‌పుట్, స్లో బైక్ రైడింగ్ పోటీలను, మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కబడ్డీలో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులుగా ఏడువేలు, అయిదు వేల రూపాయలు, షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా నాలుగువేలు, మూడువేల రూపాయలు, స్లో బైక్ రేసింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల క్రింద నాలుగువేలు, మూడువేలు, రెండువేల రూపాయలు, ముగ్గుల పోటీలో గెలుపొందిన ముగ్గురికి వరుసగా అయిదువేలు, నాలుగు వేలు, మూడువేల రూపాయలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ముఖ్యఅతిథులు అందజేశారు. ఈ కార్యక్రమ పర్యవేక్షకులుగా లేకిన్‌రెడ్డి, సాయి, ముజీర్, అశోక్, ప్రజ్వల్ వ్యవహరించారు.

# ప్రతిభా పరీక్షలో మెరిసిన 'రత్నం'



గాయత్రి పరివార్ ప్రతి ఏడాది నిర్వహించే భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష 2014-15కుగాను డిసెంబర్ 28న నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో నెల్లూరు సరస్వతి నగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థిని డి.సాహితి జిల్లాస్థాయిలో 2వ స్థానం సాధించింది. ఈ సందర్భంగా డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు సాహితిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిడి మనోజ్‌కుమార్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఏఓ ప్రియాంక, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### బయ్యా వెంకటరమణయ్య



నెల్లూరులో పెళ్లి పట్టుచీరలంటే ముందుగా గుర్తుకొచ్చేది చిన్నబజారులోని న్యూరాజ్యలక్ష్మి హాల్. ఆ సంస్థ వ్యవస్థాపకుడైన బయ్యా వెంకటరమణయ్య ఈనెల 15వతేదీ సంక్రాంతిపండుగ నాడు దైవ సన్నిధి చేరారు. దుత్తలూరు మండలం రాచవారిపల్లెకు చెందిన వెంకటరమణయ్య చిన్నతనంలోనే నెల్లూరుకొచ్చారు. పట్టుదలతో కష్టపడ్డారు. వ్యాపారంలో ఎదిగారు. మంచిపేరుతో పాటు నమ్మకం పెంచుకున్నారు. ఏడాది క్రితమే నెల్లూరు లీలామహల్ సెంటర్‌లో 'శుభమస్తు' షాపింగ్ మాల్‌ను ప్రారంభింపజేశారు. వ్యాపారంలో తన మార్గంలోనే తన కొడుకులు బయ్యా శ్రీనివాసులు, రవికుమార్‌లను నడిపించారు. ఎంతో ఆరోగ్యంగా ఉన్న ఆయన హఠాత్తుగా గుండెపోటుకు గురై మరణించారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో పాటు ఆరెస్సెస్ జాతీయ నాయకులు, నెల్లూరుజిల్లా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు ఆయన మృతికి నివాళులర్పించారు. రమణయ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### డాక్టర్ సి.ఆర్.రెడ్డి



నెల్లూరులోని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు, కవితా నర్సింగ్‌హోమ్ అధినేత డాక్టర్ సిఆర్ రెడ్డి ఈ నెల 19వ తేదీన స్వర్గస్థులయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు కూడా వైద్యులుగానే స్థిరపడ్డారు. అందరిలోనూ సిఆర్‌రెడ్డిగా ముద్రపడ్డ సి.రామచంద్రారెడ్డి నెల్లూరుకు మొట్ట మొదటి మానసిక వైద్య నిపుణులు. గతంలో ఐఎంఏ నెల్లూరుశాఖ అధ్యక్షుడిగా పని చేశారు. నెల్లూరు, సరస్వతినగర్‌లో నిర్మించిన ఐఎంఏ హాల్ నిర్మాణ కమిటికి ఛైర్మెన్‌గా పనిచేశారు. నెల్లూరులో చాలామంది వైద్యులకు మార్గదర్శి వంటివారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## శ్రీ రంగనాథుని హుండీ ఆదాయం 11లక్షలు

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భక్తులు స్వామివారికి కానుకల రూపంలో రూ.11,03,775లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, దేవస్థానం అర్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి లక్ష విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులో వున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరుకు చెందిన సి.సుభాషిణి లక్షరూపాయలు విరాళాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు శాఖ కోశాధికారి మోహన్‌లాల్ జైన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ టి.లక్ష్మి, మేనేజ్‌మెంట్ కమిటిసభ్యులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన అతిరుద్రహోమం

నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీదేవి అమ్మవారు ఆశ్రమంలో వైభవంగా అతిరుద్రహోమం ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణతో 101మంది వేదపండితులతో కనులవిందుగా బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 111హోమాలకు కలశాలను శ్రీ విజయేశ్వరిదేవి తీసుకొచ్చి హోమాలను వైభవంగా ప్రారంభించారు. అనంతరం మహాశివునికి అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు శ్రీమణి ద్వీప మహాసంస్థానంలో నిర్వహిస్తున్నారు.

# కమిషనర్‌ను సాగనంపేందుకు కుట్ర



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్ బాబును సాగనంపేందుకు కుట్ర జరుగుతోందని కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి అనుమానం వ్యక్తపరిచారు. మంగళవారం నెల్లూరు నగర కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఐఏఎస్ హోదా కలిగిన కమిషనర్‌ను నెల్లూరుకు వేశారని, ఈయన గతంలో కార్పొరేటర్లతో సరిగా మాట్లాడకపోవడం, అడిగిన సమస్యలపై సకాలంలో స్పందించకపోవడంలాంటి అంశాలతో చిన్నచిన్న పొరపాట్లు చేశారని, ఇలాంటి లోపాలపై తాము కూడా గతంలో ఆరోపణలు చేసిన మాట వాస్తవమేనన్నారు. కాని ప్రస్తుతం కమిషనర్ తన వైఖరిని మార్చుకుని అందరితో సవ్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. మేయర్ అధికారపక్షంలో ఉండి కూడా కమిషనర్ తన మాట వినడం లేదనే సాకుతో తనకు నచ్చిన కార్పొరేటర్లతో రహస్య సమావేశాలు నిర్వహిస్తూ కమిషనర్‌ను ఇరకాటంలో పెట్టి ఇక్కడ నుంచి ఆయనే వెళ్లిపోయేలా చేయడం లేదా అధికారాన్ని అడ్డం పెట్టుకుని బదిలీ చేయించే ఆలోచనలో ఉన్నాడని అన్నారు.

## శుభమస్తు ఆఖరి నానో కారు డ్రా



నెల్లూరులోని శుభమస్తు షాపింగ్ మాల్‌లో ఆరువారాలు, ఆరు నానోకారులు, రోజుకో పట్టుచీర ఆఫర్లలో భాగంగా బుధవారం ఆరో నానోకారు డ్రా నిర్వహించారు. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి అతిథిగా పాల్గొని డ్రా తీశారు. చెన్నైకు చెందిన ఎన్.మనోహర్(కూపన్ నెం. 076163) కారు గెలుచుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవి పాల్గొన్నారు.

## కత్తిమీద సామే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతీయపార్టీల పరిస్థితి అది కాదు. ఒక ఎన్నికలో అధికారానికి రాకపోతే ఇక ఆ పార్టీని నిలుపుకోవడం కష్టం. రాష్ట్ర చరిత్రలో తెలుగుదేశంపార్టీ ఒక్కటే ప్రాంతీయపార్టీగా పటిష్టంగా నిలిచింది. దీనికి కారణం కేవలం ఎన్టీఆర్ ఆ పార్టీని పెట్టబట్టే! మొన్న ఎన్నికల్లో అధికారం రాకపోయి వుంటే తెలుగుదేశంపార్టీ పరిస్థితి కూడా తలక్రిందులే!

2008లో చిరంజీవి ఆర్భాటంగా ప్రజారాజ్యంపార్టీని పెట్టాడు. 2009 ఎన్నికల్లో చతికిలబడ్డాడు. వెంటనే పార్టీని మూసేసి కాంగ్రెస్‌లో కలిసిపోయారు. రేపు జగన్ పరిస్థితి ఏంటన్నది పెద్దప్రశ్న? మొన్న ఎన్నికల ముందు వైకాపాకు రాష్ట్రంలో మంచి ఊపు కనిపించింది. వైకాపా అధికారంలోకి రావడం, జగన్ సీఎం కావడం ఖాయమనుకున్నారు. అయితే అంచనా తప్పింది. వైకాపా అనూహ్యంగా ఓడిపోయింది. జగన్‌తో ఉన్న నేతల్లో నిరుత్సాహం అలుముకుంది. తెలుగుదేశం అధికారంలోకి రాగానే ఇద్దరు వైకాపా ఎంపీలు ఆ పార్టీలోకి జంప్ అయ్యారు. తర్వాత ఒకరు ఆగారు. దాదాపు పాతికమంది ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి పోతారనే ప్రచారం జరిగింది. అయితే తెలుగుదేశంలో కూడా పరిస్థితులు బాగాలేక వాళ్లంతా ఆగారు. ప్రతిపక్షంగా వైకాపా ఏ మాత్రం బలహీనపడినా ఆ పార్టీలో కేడర్ నిలవదు. జగన్‌కు ప్రస్తుతం కలిసొస్తున్న అంశమేంటంటే చంద్రబాబు ప్రభుత్వం అవకతవకలుగా ఉండడం. చంద్రబాబు పరిపాలనా పరంగా ఊపుమీదుంటే వైకాపా నిలవడం కష్టమయ్యేది.

## అభివృద్ధి వైపు అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

పైసా రాబడిలేని పెట్టుబడులు. రాష్ట్రానికి ఇప్పుడు ఇవి అవసరం లేని కార్యక్రమాలు. చంద్రబాబు సీఎం అయ్యి ఎనిమిది నెలలవుతుంటే ఇంతవరకు చెప్పుకోదగ్గ అభివృద్ధి పని ఒక్కటీ జరగలేదు. చంద్రబాబు పోకడలు ఇలానే వుంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇంకా కునారిల్లడం ఖాయం.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు చేతుల్లో లేదు. కేంద్రప్రభుత్వం ఆదుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి పరంగా ముందడుగు వేయాల్సిన పరిస్థితి. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్నో హామీలిచ్చాయి. విభజన మూలంగా ఏర్పడే లోటుబడ్జెట్‌ను భర్తీ చేయడంతో పాటు హైదరాబాద్‌లో వున్న కేంద్ర సంస్థలను ఏపిలో నెలకొల్పడం, రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి, నూతన రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చడం, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీల అమలుకు కేంద్రం శ్రీకారం చుట్టాల్సివుంది. ముఖ్యంగా ఏపికి ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో ఇతర రాష్ట్రాలు అభ్యంతరం పెడుతున్నాయి. ఏపికి ఇస్తే మాకూ ఇవ్వాల్సిందేనంటున్నాయి. ఇది న్యాయం కాదు. దేశ చరిత్రలో విభజన మూలంగా ఏపికి జరిగినంత అన్యాయం ఇంకే రాష్ట్రానికి జరిగి వుండదు. ఏపిని ప్రత్యేక కోణంలో చూడాలి. అదీకాక మెజార్టీ రాష్ట్రాలు బీజేపీ, కాంగ్రెస్ ఏలుబడిలో వున్నాయి. ఏపికి ప్రత్యేక హోదా, హామీ ఇచ్చింది కూడా ఆ రెండు పార్టీలే కాబట్టి తమ ప్రభుత్వాలున్న రాష్ట్రాలను అవి ఒప్పించుకోగలవు. ఇక రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలిస్తే పారిశ్రామికంగా కూడా రాష్ట్రం అభివృద్ధి చెందగలదు. నవ్యాంధ్ర నూతన రాజధాని ప్రాంతం ఎంపిక కూడా జరిగిపోయింది. కాబట్టి రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేయాల్సివుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదన్నది వాస్తవం. ఉన్న అరకొర ఆదాయాన్ని చంద్రబాబు ప్రచార్భాటాలకు ఖర్చు చేస్తు న్నాడు. ఇక కేంద్రం పూనుకుని ఇచ్చిన హామీలను నెరవేరిస్తేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ముందుకు కదులుతుంది.

## అతిఅంచనా?

(మొదటిపేజీ తరువాయి)

నుండి ప్రజలు ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా అక్కడ స్థిరపడ్డారు. అందరూ పెట్టుబడులు పెట్టారు. కాబట్టే హైదరాబాద్ ఈరోజు అంతర్జాతీయ నగరం స్థాయికి ఎదిగింది. తుళ్లూరుకు అంతటి సీన్ రావాలంటే వందలఏళ్లు దాటడం ఖాయం. ముఖ్యంగా ఏపిలోని 13జిల్లాల ప్రజలు అక్కడికి వలసపోయే పరిస్థితులు లేవు. భూముల ధరలు ఆకాశాన్నంటే నేపథ్యంలో పెట్టుబడులకు కూడా అవకాశాలు తక్కువ. సింగపూర్ రాజధాని మాయలో అతిగా ఆశలు పెంచుకుని అక్కడి రైతులను నాశనం చేయడం తప్పితే రాజధాని వల్ల ఎవరికీ మేలు జరిగే అవకాశం లేదు.

గల్పిక 989

## వెంకయ్య ఇంట...
# సంక్రాంతి వేడుకల్లో పేడ పురాణం

అది వందలఏళ్ల పాటు పరాయి పాలనలోనూ, 60ఏళ్లు కాంగ్రెస్ పాలనలోనూ మగ్గి మాడి మసైపోయిన ఢిల్లీ నగరం. పార్లమెంటు పులి, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు నివాసం. ఇంటి వద్ద చాలా కోలాహలంగా వుంది. తాటి మట్టలు, అరటిపిలకలు, మామిడి ఆకుల తోరణాలతో ఇంటి ఆవరణంతా అలంకరించిపెట్టారు. ఇంటి ఆవరణలో ముగ్గులు, వాటి మధ్య గొబ్బెమ్మలను అందంగా అలంకరించిపెట్టారు. ఢిల్లీలో వుండే వారికి తెలుగు సంక్రాంతి రుచి చూపించాలని చెప్పి వెంకయ్య ఆరోజు తన ఇంట్లో సంక్రాంతి వేడుకలు పెట్టి పార్టీలకతీతంగా అందరు నాయకులను పిలిచారు. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీతో పాటు బీజేపీ నుండి ఎల్.కె.అద్వానీ, ప్రధాని నరేంద్ర మోడీ, ఇంకా రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, అమిత్‌షా, హర్షవర్ధన్, స్మృతిఇరానీ, సిపిఎం నుండి ప్రకాశ్‌కారత్, సిపిఐ నుండి డి.రాజా, సమాజ్‌వాదీ నుండి ములాయంసింగ్‌యాదవ్, బిఎస్పీ నుండి మాయావతి, తెలుగుదేశం నుండి హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు, వైకాపా నుండి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి, ఇంకా ఎంతోమంది నాయకులు, పార్లమెంటు సభ్యులు వచ్చారు. వెంకయ్యనాయుడు, ఆయన పి.ఎస్ సత్య అచ్చతెలుగు పంచెకట్టుతో వచ్చిన అతిథులకు స్వాగతం పలికి లోపలకు తీసుకెళ్ల సాగారు. మహిళా నాయకులను మాత్రం వెంకయ్య సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపా వెంకట్‌లు పిలుచుకుని వెళుతున్నారు. వెంకయ్య, సత్యలు ఇంకా ఎవరో వస్తే సంక్రాంతి సంబరాలు మొదలుపెట్టాలన్నట్లుగా గేటు వైపే చూస్తున్నారు. అంతలో గేటు వద్ద నాలుగు కార్లు ఆగాయి. అందులో నుండి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మన్మోహన్‌సింగ్, చిదంబరం, పనబాక లక్ష్మిలు దిగారు. వెంకయ్య వారికి ఆత్మీయంగా స్వాగతం పలికాడు. సోనియా... మీ కొంపలో సంకురాతిరి ఫెస్టివల్‌కు పిలిచినందుకు ధన్యవాదములు వెంకయ్యాజీ అని తనకొచ్చిన తెలుగుకు ఇంగ్లీష్ మిక్స్‌చేసి చెప్పింది.

అందరూ రావడంతో వెంకయ్య సంక్రాంతి వేడుకలను మొదలు పెట్టాడు. మొదట అల్లూరు మండలం తాటాకులదిన్నె నుండి తెప్పించిన తాటాకులతో భోగిమంట వేసారు. వెంకయ్య, సత్యలు స్వయంగా తాటాకులు మంటలో వేస్తూ మంట ఎత్తుగా వచ్చేలా చేశారు. సోనియా ఆ మంటను చూసి... వెంకయ్యాజీ... ఈ భోగిమంట ఎందుకు వేస్తారు అని అడిగింది. వెంకయ్య దానికి... ప్రజలు ఆనందంతో భోగి మంటలు వేసుకుంటారని చెప్పాడు. ఓహో అలాగా... అట్లాగయితే మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చేసినప్పుడు సీమాంధ్రలోని 13జిల్లాల్లో ప్రజలు కూడా ఆనందంతో భోగిమంటలు వేసారు కదా, మరి మొన్న ఎన్నికల్లో మాకెందుకు ఓట్లేయలేదని అడిగింది. అందుకు వెంకయ్య... అవి ఆనందంతో వేసిన మంటలు కాదు మేడమ్... కడుపు మంటతో వేసిన మంటలు. రాష్ట్ర విభజనకు నిరసనగా సీమాంధ్రులు ఆందోళనలు చేస్తూ వేసిన నిరసన మంటలు అని చెప్పాడు. నాన్సెన్స్... మంటల్లో కూడా ఇన్ని రకాలా... ఏదైనా మంట ఒకటే. దాని నుండి వచ్చే సెగ ఒకటే. మీరు వేసిన భోగిమంట ఆనందంతో వేసిందయితే, ఆ మంటలు కూడా ఆనందంతో వేసుకున్నవే అంటూ సోనియా తన వాదనను సమర్ధించుకుంది. వెంకయ్య ఆమెకు ఏం చెప్పాలో అర్ధంకాక తలపట్టుకున్నాడు. అంతలో దీపా వెంకట్, వెంకయ్య కొడుకు హర్షవర్ధన్‌లు ఇంట్లో వున్న పాత చీపుర్లు, చేటలు, చాపలు, పాత గుడ్డలన్నీ తెచ్చి భోగిమంటలు వేయసాగారు. ఇవన్నీ మంటలో ఎందుకేస్తున్నారని సోనియా అడిగింది. ఇంట్లో పనికిరాకుండా అడ్డంగా వున్న చెత్తంతా భోగిమంటల్లో వేస్తుంటామని సత్య అన్నాడు. ఆ మాట విన్న వెంటనే రాహుల్‌గాంధీ... మమ్మీ, మనింట్లో కూడా చాలా చెత్త వుంది, ఇప్పుడే వెళ్లి కారులో ఆ చెత్తంతా తెచ్చి ఈ మంటలో వేస్తానన్నాడు. మనింట్లో చెత్త ఎక్కడుందని సోనియా సందేహంగా అడిగింది. రాహుల్ వుండి... అదే మమ్మీ, మన పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్‌లు, మన పెద్దోళ్ల కటౌట్‌లు... చాలా వున్నాయి కదా, ఇప్పుడల్లా వాటితో పని లేదు, ఇంటికి అడ్డం తప్పితే అని చెప్పాడు. రాహుల్ మాటలు విని పక్కనేవున్న నరేంద్ర మోడీ... అబ్బాయి చాలా షార్ప్‌గా వున్నాడు మేడమ్, ఏదైనా ఇట్టే పసిగట్టేస్తాడని అభినందించాడు. సోనియా మాత్రం రాహుల్‌ను వెళ్లకుండా వారించింది. భోగి మంట చూసుకుని అందరూ గంగిరెద్దుల వద్దకు వచ్చారు. గంగిరెద్దుల చేత వాటి యజమానులు ఆడిస్తున్నారు.... డూడూ బసవన్న అంటూ వాళ్లు వాయిద్యాలు వాయిస్తుంటే ఎద్దు వారు చెప్పినదానికల్లా తలాడించసాగింది. వెంకయ్య గంగిరెద్దుల ప్రత్యేకతను అందరికీ వివరిస్తూ డూడూబసవన్న అని డోలు కొడుతుంటే ఎద్దులు వాళ్లు చెప్పినదానికల్లా తలాడిస్తుంటాయని చెప్పాడు. అది చూసి... ఎద్దుల్లో కూడా ఈ సాంప్రదాయముందా అని సోనియా అడిగింది. ఎద్దుల్లో ఉండడమేమిటి... ఇంకెక్కడ వుంది ఈ సంప్రదాయం అని అద్వానీ ఆశ్చర్యంగా అడిగాడు. దానికి సోనియా, మన్మోహన్‌సింగ్‌ను చూపిస్తూ ఈ సిస్టమ్‌ను మా మన్మోహన్ గారు ప్రధానిగా ఉన్నప్పుడే ఫాలో అయ్యారు అని చెప్పింది. అంతలో అందరికీ ప్లేట్లలో దోశెలు, చికెన్ పులుసు తెచ్చారు. నాన్‌వెజ్ అలవాటుండే వాళ్లంతా లొట్టలేసుకుని తిన సాగారు. మోడీ, అద్వానీ వంటి శాఖాహారులు మాత్రం దోశెల్లో ఎర్రకారం కలుపుకుని తిన్నారు. తర్వాత అందరికీ అరిశెలు, జంతికలు, లడ్లు తెచ్చి పెట్టారు. గుండ్రంగా వున్న అరిశెలను చూపిస్తూ సోనియా... వెంకయ్యాజీ... వీటిని ఎలా తయారు చేస్తారు, చాలా బాగున్నాయని అడిగింది. అప్పుడు వెంకయ్య ఆమె వద్ద కూర్చుని... టేకెన్ ఫోర్ కిలో రైస్.. రోట్లో వేసి బాగా గ్రైండింగ్... ఆఫ్టర్ పౌడర్... ఫోర్ లీటర్ వాటర్... మిక్స్... స్టౌ మీద కూకింగ్... బెల్లం టేకింగ్... ఆఫ్టర్ హాఫ్ అవర్... బెల్లం పాకం అండ్ పౌడర్ మిక్సింగ్... పాకం పిండిని స్మాల్ బాల్స్‌గా చేసి, అరచేతుల్లో వేసి తట్టాలి... ఆ తర్వాత బాయిల్డ్ ఆయిల్‌లో తట్టిన పిండి గోయింగ్... ఆఫ్టర్ ఫైవ్ మినిట్స్... హాట్‌హాట్ అరిసె కమింగ్... అని చెప్పాడు. అంతా విని సోనియా భలేభలే... నాకు కూడా అరిశెలు చేయడం వచ్చేసింది. వెంకయ్యాజీ ఈ అరిసెలు నాకు కూడా ఫోర్‌కిలోస్ కావాలి అని అంది. వెంటనే వెంకయ్య నెల్లూరులోని కోమల విలాస్ ప్రసాద్‌కు ఫోన్ చేసి... ప్రసాద్, ఓ నాలుగుకిలలో అరిసెలు పార్శిల్ చేసి సోనియాగాంధీకి కొరియర్‌లో పంపించు అని పెట్టేసాడు. తర్వాత అందరూ ముగ్గులను తిలకించ సాగారు. ఆ ముగ్గులలోని అన్ని రకాల రంగులను చూస్తూ... సోనియా అన్ని పార్టీల జెండాల రంగులు ఇక్కడ ఉన్నాయంది. అందుకు వెంకయ్య.. పార్టీలు పుట్టాకా రంగులు రాలేదు మేడమ్... రంగులు వచ్చాకే పార్టీలు, జెండాలు, అజెండాలు వచ్చాయన్నాడు. సోనియాగాంధీ అలా ముగ్గులు చూస్తూ ఓ ముగ్గులోని గొబ్బెమ్మ మీద కాలేసింది. ఆమె కాలికి పేడయ్యింది. షిట్... ఏంటి వెంకయ్యాజీ ఇది... ఎవరైనా చావిట్లో పేడను తెచ్చి ఇంట్లో పెట్టుకుంటారా అని కోపంగా అంది. దానికి వెంకయ్య... అదేముందిలే సోనియాజీ... ఇటలీలో వున్న మిమ్మల్ని తెచ్చి మేము ఇండియాలో మా నెత్తిన పెట్టుకోలేదా అని కౌంటర్ వేశాడు. దాంతో సోనియా నోరెత్తకుండా ఆగిపోయింది.

అప్పుడు వెంకయ్య...
పేడ లేని ఊరు, గోడ లేని ఇళ్లు
నీడలేని మనిషి, మేడ లేని పట్టణం
కూడు లేని బ్రతుకు... గూడు లేని జీవితం...

అంటూ ఇంకా ప్రాసలు కొనసాగిస్తుండగా... సోనియా రెండు చేతులు జోడించి, సార్, మీ ప్రాసలు ఇక ఆపండి, ఇక పేడ గురించి, పిడకల గురించి నేనెప్పుడూ మాట్లాడనని చెప్పింది.

## కదంబం

### దప్పిక

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
కడప, 9441287865

చెట్ల ఆకునరాలకు చెవి యొగ్గిచూడు
ఎన్ని మట్టుల లోతు భూమి దప్పిక విన్పిస్తుందో!
చెరువు లోతట్టు గడ్డి దుబ్బుల ఎండు మొహాలు చూడు
ఎన్ని కూతవేటు దూరాల మబ్బుల వంధ్యత్వం కన్పిస్తుందో!
మైదానాల నిండా ఎండిపోయే పెదాల వేదన
అడవులన్నిటా పిడచట్టుకుపోయే నాలుకల రోదన
జలాశయాల నోళ్లు తెరచి భూమితల్లి విలపిస్తోంది
దాహం... దాహం... దాహం... దాహమంటూ...

మాయబ్బగారి చెరువుల కాలం ఇప్పుడు కలగా మిగిలింది.
మా నాయనగారి దిగుడుబావుల తరం కల్లగా మారింది.
మేం ప్రారంభించిన గొట్టపు బావుల సాగుబడి
సగం తరానికే ఆయుష్షు కోల్పోయింది.
ఎండిపోయిన బోరుబావుల్లోకి జారిన మా పిల్లలు
గొంతు తడవక యింకా బైటకు రాలేదు.
ఎండిపోతోన్న పైరు కోసం వేటకత్తులు పట్టిన మా సోదరులు
జైలు గోడల్లోంచి యింకా ఇళ్లకు చేరుకోలేదు.
సాగునీటి కోసం అరచి రాపెక్కిన మా గొంతుల్నిండా
ఇప్పుడు కేవలం దప్పిక... దప్పిక... దప్పిక...

ఎద్దుల గాడి రొచ్చు మట్టుపై కాలు మోపితే చాలు
కబేళాల కసాయి దృశ్యాలు ఎర్రతేళ్లయి కాటేస్తాయి.
గాదెల్లోని చీకట్లలోకి కళ్లు దింపితే చాలు
వలస బతుకుల కథలెన్నో చెవితంబెకు కందిరీగలవుతాయి.
మేఘాలకావైపు ఎక్కడో రైతుల రుతువులు బందీలయివున్నాయి.
నదుల గర్భాల్లో నాగళ్ల బతుకులు సమాధి చేయబడ్డాయి.
ఎండిన నేలతల్లి రొమ్ముకు ఎంత లోతు గాట్లు పెట్టి చీకినా
పొడి సుద్ద తప్ప పెదాలకు తడిరుచి అంటటం లేదు.
కరువుతో చేయి కలిపిన ఖద్దరు పెద్దల అసమర్ధ పాలన
పైరు పచ్చల్ని ఎండబెట్టే పనిలో ఒలంపిక్ పథకాలపై
పోటీ పడుతోంది.
అందుకే సీమనేల నిండా నింగికెగసే ఆర్తారావాల పరంపర...
దప్పిక... దప్పిక... దప్పిక... దప్పిక...

## ములుగు లక్ష్మీమైథిలికి సన్మానం



తమిళనాడు హిందీ అకాడమీ వారు ఈ నెల 10వ తేదిన చెన్నైలోని జైన్ విద్యాశ్రమ్‌లో నిర్వహించిన విశ్వ హిందీ దివస్‌లో భాగంగా, అన్య భాషా సేవా సన్మాన్ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి శ్రీమతి ములుగు లక్ష్మీమైథిలికి పురస్కారం అందించి సత్కరించారు. తెలుగు భాష, సాహితీ రంగాల్లో చేస్తున్న విశేషకృషికి గాను ఆమెకు ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు హిందీ అకాడమీ అధ్యక్షులు డా.బాలశౌరిరెడ్డి, కృష్ణచంద్ చోర్డియా, మణికంఠన్, ఎన్.గురుమూర్తి, డా.కళారాణి, ఆర్.కృష్ణమూర్తిల చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## శ్రీకృష్ణ లీలామృతం పుస్తకావిష్కరణ

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ప్రసూన శరత్ రచించిన శ్రీకృష్ణ లీలామృతం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ నెల 18న జరిగింది. ప్రముఖ కవయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పెరసం ప్రధాన కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెట్టు రామచంద్రప్రసాద్, మోపూరు పెంచలనరసింహం, నాగార్జునాచారి, బొగ్గవరపు రాధాకృష్ణ, అవ్వారు శ్రీధరబాబు, గుండాల నరేంద్రబాబు, ఏటూరి నాగేంద్ర, ఇంద్రగంటి మధుసూదనరావు, కవయిత్రులు తోట సులోచన, పి.అన్నపూర్ణ, గాయత్రిలు పాల్గొన్నారు.

## కనువిందుగా కనుమ తెప్పోత్సవం



సంక్రాంతి పండుగల సందర్భంగా 16వతేదీ రాత్రి కనుమ రోజున నెల్లూరులోని అన్ని ప్రముఖ ఆలయాల్లోని ఉత్సవమూర్తులకు కనుమ పార్వేట ఉత్సవం కనువిందుగా నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేట నుంచి మైపాడురోడ్‌లోని పత్తివారిసత్రం వరకు పలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వేదికలపై ఉత్సవమూర్తులు కొలువుదీరారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సిద్ధి వినాయకస్వామి, శ్రీ రంగనాధస్వామి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పప్పులవీధిలోని శ్రీ వినాయకస్వామి, నవాబుపేటలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ వేంకటేశ్వరస్వామివార్లను ఈ ఉత్సవాల్లో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామికి జాఫర్‌సాహెబ్‌కెనాల్‌లో ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి ప్రముఖ సినీ నిర్మాత కళ్యాణ్, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. నవాబుపేట మిత్రమండలి ఆధ్వర్యంలో మద్దూరు సుబ్బారావు నిర్వహణలో ఈ ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవాలతో ఈ ప్రాంతమంతా భక్తజనసందోహంతో నిండిపోయింది. ఈ కార్యక్రమాల్లో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, రూప్‌కుమార్‌యాదవ్, అడిషనల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డితో పాటు మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకా, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# బెంగళూరులో సింహపురి తేజం



## పోలీస్ జాయింట్ కమిషనర్‌గా నెల్లూరీయుడు మువ్వా చంద్రశేఖర్

పుట్టింది..ఎక్కడో మారుమూలన వున్న ఓ చిన్న గ్రామం.. ఇప్పుడు మహానగరంలో ఎంతో ఉన్నత మైన పోలీసు అధికారిగా ఉద్యోగం.. ఎంతో ఆశ్చర్యకరమైన ఇంతటి స్థాయిని సాధించాలంటే మాటలు కాదు. పట్టుదల, కృషి వుండాలే గానీ, ఇలా ఎంతటి కష్టసాధ్యమైన లక్ష్యాలనైనా సాధించవచ్చునేందుకు బెంగళూరు ఈస్ట్ క్రైమ్ జాయింట్‌కమిషనర్ మువ్వా చంద్రశేఖర్ ఒక ఉదాహరణ.



తల్లిదండ్రులు మరియు కుటుంబసభ్యులతో చంద్రశేఖర్

నెల్లూరుజిల్లాలోని ఏఎస్‌పేట మండలంలోని కొండమీద కొండూరు అనే చిన్న గ్రామంలో జన్మించిన మువ్వా చంద్రశేఖర్, ఇప్పుడు కర్నాటకలో సింహపురి సీమ ప్రతిభను మారు మ్రోగిస్తున్నారు. కన్నడనాట కూడా సింహపురి సత్తా చాటుతున్నారు. వృత్తిలో నిబద్ధతతో, అచంచల దీక్షాదక్షతలతో పనిచేస్తూ, నేరగాళ్ళ గుండెల్లో సింహస్వప్నంగా వుంటూ, ప్రజలకు తనవంతు సేవ లందిస్తూ.. పోలీసు ఉన్నతాధికారిగా మంచి గౌరవంతో రాణి స్తున్నారు. ఈ సీమలో జన్మించిన ఓ ప్రతిభాశాలి బెంగళూరు జాయింట్‌కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించడం సింహపురి సీమకే గర్వకారణం. నేరగాళ్ళకు ఆయన పేరు వింటేనే దడపుట్టినా.. పేదలకు ఆయనంటే ఎంతో అభిమానం. నిరుపేదలకు, ప్రత్యేకించి న్యాయం కోసం తనవద్దకు వచ్చినవారికి ఎంతో చిత్తశుద్ధితో తనవంతు సేవలందించడంలో ఆయనకు ఆయనే సాటి. అందుకే ఆయనంటే ప్రజలకు ఎనలేని అభిమానం.. గౌరవం. బెంగళూరు మహానగరంలో ఈస్ట్ క్రైమ్ జాయింట్ కమిషనర్‌గా సేవలందిస్తోన్న ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శకం. అయితే, అంతటి ఉన్నతమైన స్థానం సాధించేందుకు ఆయన పడిన కష్టం మాత్రం అంతాఇంతా కాదు. కృషి వుంటే మనుషులు ఋషులవుతారన్న చందంగా, చిన్నతనం నుంచి ఆయన విద్యలో ప్రతిభతో రాణిస్తూ, తన భవితకు బాటలు వేసుకున్నారు. ఎంత కష్టమైనా సరే, జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనుకున్నారు. క్రమశిక్షణతో చదువుకుంటూ.. ఆ చదువులతల్లినే నమ్ముకున్నారు. ఎట్టకేలకు పోలీసు అధికారి కావాలనే తన కలను సాకారం చేసుకున్నారు.

నెల్లూరులోనూ, ఆ తర్వాత చెన్నైలోనూ చదువును సాగించి, పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ ఐఐటిలో చేరి అక్కడ కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత, బెంగళూరులో ఒకటిన్నర సంవత్సరం పాటు ఇన్ఫోసిస్‌లో ఐటి ఇంజనీర్‌గా ఉద్యోగం చేశారు. అయితే, చిన్నతనం నుంచి అనుకుంటున్న లక్ష్యాన్ని చేరుకోవాలనే ఉద్దేశ్యంతో, జీవితానికి సార్ధకత వుండేలా పోలీసు అధికారిగా ప్రజలకు సేవలందించాలనుకున్న తన లక్ష్యసాధన కోసం, సివిల్స్‌లో చేరి మరింత శ్రద్ధతో చదువు కొనసాగించారు. ఐటి ఇంజనీర్‌గా పనిచేస్తూనే, ఏడాదికాలం అహోరాత్రులూ కష్టపడి చదువుకుని యుపిఎస్‌సి పరీక్షలు రాశారు. పట్టుదలతో చదువుకుని, ఎట్టకేలకు అనుకున్న లక్ష్యం సాధించారు. తొలి ప్రయత్నంలోనే 1998లో సివిల్స్‌లో జాతీయస్థాయిలో 47వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నారు.

కేవలం 24 ఏళ్ళ వయసులోనే ఐపిఎస్ సాధించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. తొలుత హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రొబేషన్ ఎఎస్‌పిగా పనిచేశారు. ఆ తర్వాత, రాజభవన్‌లో ఏడీసీగా ఏడాదిన్నరపాటు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం, బిలాస్‌పూర్ ఎస్పీగా మూడేళ్ళపాటు సమర్ధవంతంగా పనిచేశారు. ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం అనేక అవార్డులతో ఆయనను ఘనంగా సత్కరించింది కూడా. ఆ తర్వాత బెంగళూరులోని డిజిపి కార్యాలయంలో అంతర్గత భద్రతా విభాగం ఎస్పీగా ఆయన నాలుగు నెలలపాటు బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత తూర్పు విభాగం డిసిపిగా బాధ్యతలు చేపట్టి, పలు కీలకమైన కేసులను ఛేదించి, పోలీసు అధికారిగా తన సమర్ధతను చాటుకున్నారు. వైట్‌కాలర్ నేరాలను సమర్ధంగా అరికట్టగలిగారు. వృత్తిలో నిబద్ధతతో అందరి ప్రశంసలూ అందుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి యడ్యూరప్ప చేతుల మీదుగా రెండు ప్రతిష్టాత్మకమైన పతకాలను కూడా అందుకున్నారు. పేదలకు న్యాయం చేసే అధికారిగా, నేరస్తులకు సింహస్వప్నంగా ఆయన ప్రఖ్యాతి చెందారు. ఎంతో సమర్ధ వంతంగా ఆయన విధులు నిర్వహిస్తు న్నారు. ఇంతటి సమర్ధుడైన అధికారికి జన్మనిచ్చిన ఆయన తండ్రి మువ్వా బలరామయ్యనాయుడు నెల్లూరు మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసి యేషన్ గౌరవసలహాదారులుగా తన సేవలందిస్తుండడం విశేషం.

### యువత కష్టపడి చదువుకోవాలి... అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలి:

యువత కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలను అందుకోవాలని, జీవితంలో అనుకున్న ఉన్నతమైన లక్ష్యాలను సాధంచుకోవాలని జాయింట్ కమిషనర్ మువ్వా చంద్రశేఖర్ ఈ సందర్భంగా యువతకు సూచిస్తున్నారు. ఏవో పుస్తకాలు బట్టీ పట్టడం కాక, చదువుకోవాల్సిన అంశాలను ఒక క్రమపద్ధతి ప్రకారం చదువుకోవాలని, తాము ఎన్నుకున్న అంశాన్ని మరింత బాగా చదువుకుని అవగాహన చేసుకోవాలని, అదే ఉత్తీర్ణతకు మార్గమని ఆయన అంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. భార్య కర్నాటక నివాసి. పేరు సెలిహా, కుమారుడు శ్రేయస్, కుమార్తె పేరు అంజలి. తొలుత, బెంగళూరులో ఇన్ఫోసిస్‌లో ఐటి ఇంజనీర్‌గా పనిచేస్తున్నా, తన జీవిత లక్ష్యసాధన కోసం మళ్ళీ కష్టపడి చదువుకుని ఐపిఎస్ సాధించడం ఆయనలోని కార్యదీక్షకు నిదర్శనం. పట్టుదలతో కృషిచేస్తే సాధించలేనిదేమీ వుండదని ఆయన నిశ్చితాభిప్రాయం. ఆయనకు జన్మభూమిపై ఎంతో అభిమానం. తాను ఎంత ఉన్నతాధికారి అయినప్పటికీ, తన స్వగ్రామాన్ని వీడి ఏళ్ళు గడుస్తున్నప్పటికీ ఆయన పుట్టిన వూరును విస్మరించకుండా, ఆ గ్రామానికి తనవంతు సేవలందిస్తూనే వుండడం విశేషం.

ఏదేమైనా, చిన్నతనం నుంచి శ్రద్ధాసక్తులతో చదువుకుని, ఎంతో ఉన్నతమైన ఐపిఎస్ సాధించి, పోలీసు ఉన్నతాధికారిగా బెంగళూరులో గురుతరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ, సింహపురి ప్రతిభను, ఖ్యాతిని దశదిశలా చాటుతున్న మువ్వా చంద్రశేఖర్‌కు 'లాయర్' అభినందన చందనాలు.



అప్పటి కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప చేతుల మీదుగా ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డునందుకున్న మువ్వా చంద్రశేఖర్



### జోహార్... సుభాష్‌చంద్రబోస్

జనవరి 23వ తేదీ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జన్మదినం. ఈ దేశానికి స్వాతంత్ర్యం రావటానికి ఆయన ప్రధాన కారకుడు. ఆయన ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన దేశభక్తుడు. ఆయన కోసం నేను సోషలిస్టుగా ఉన్న రోజుల్లో డాక్టర్ రామమనోహర్‌లోహియాచే నెల్లూరులోని సుబేదారుపేటలో నేతాజీ విగ్రహాన్ని ప్రారంభించాం. అంతకుమించి ఏమీ చేయలేకపోయి నందుకు కన్నీటితో ఈరోజు మీకు జోహారులర్పిస్తున్నాను.

- ఎల్.వి.కృష్ణారెడ్డి




జననం: 01-7-1941
మరణం: 15-1-2015

మంచిని పెంచావు.. మమతలు పంచావు...
మానవత్వం మాకు నేర్పావు.. మంచిమార్గం మాకు చూపావు
మీ జ్ఞాపకాలు, ఆశయాలను ఎన్నటికీ మరువలేము.

ఉత్తరక్రియలు

మా దైవం
శ్రీ బయ్యా వెంకటరమణయ్య గారు
(న్యూరాజ్యలక్ష్మీహాల్, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత)
జనవరి 15వ తేదీ మము వీడి దైవసన్నిధి చేరారు.
వారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు: బయ్యా శ్రీనివాసులు(వాసు), బయ్యా వెంకట రవికుమార్
మరియు కుటుంబసభ్యులు, సిబ్బంది

ఉత్తరక్రియలు:
తే 29-1-2015ది గురువారము శిలోద్వాసన
తే 30-1-2015ది శుక్రవారము సపిండీకరణ (పొత్తర్లు)
తే 31-1-2015ది శనివారము వైకుంఠసమారాధన

నెల్లూరు చిన్నబజార్, (న్యూ రాజ్యలక్ష్మిహాల్ ఎదురువీధి) సవరాలవీధిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
పంక్తి: తేది.31-1-2015 శనివారం మ॥ 12-00గం.లకు నెల్లూరు, రంగనాయకులపేట, గోపురంవీధిలోని శ్రీ పాండురంగ నిలయం నందు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com